JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రభాత జయభేరి

ప్రజల పక్షాన అక్షర యజ్ఞం

ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి | గురువారం 30-07-2026
Medchal - Malkajgiri | Thursday 30-07-2026

Follow: jayabherinews

సంపుటి : 03 | సంచిక : 59
పేజీలు : 8 | వెల : 5
Vol. 03 | Issue 59 | Pages : 8 | ₹: 5

**విలేకర్లు కావలెను**

మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...

9391 544 889
call me

jayabheripaper@gmail.com



తెలంగాణ పై కాంగ్రెస్ నాయకత్వం ప్రత్యేకంగా ఫోకస్ చేసింది. దక్షిణాది పై పట్టు జారకుండా ముందస్తు వ్యూహాలు అమలు చేస్తోంది. తమిళనాడు ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న కాంగ్రెస్, కర్ణాటక.. తెలంగాణ, కేరళలో అధికారంలో ఉంది. దీంతో.. తెలంగాణలో ఎక్కడా ప్రతిపక్షాలకు అవకాశం ఇవ్వకుండా ప్రతీ పరిణామం పరిశీలిస్తోంది. అందులో భాగంగా సీఎం రేవంత్ సహా పార్టీ ముఖ్యులకు తాజా సమీక్షలో కీలక దిశా నిర్దేశం చేసారు. తమ వైఖరి తేల్చి చెప్పారు.



# ప్రత్యామ్నాయం తప్పదు..!!

- తేల్చి చెప్పిన కాంగ్రెస్ హైకమాండ్
- సీఎం రేవంత్ సహా పార్టీ ముఖ్యులకు తాజా సమీక్షలో కీలక దిశా నిర్దేశం
- నామినేటెడ్ పదవులు సర్ ప్రక్రియ తరువాత భర్తీ

**జయభేరి, న్యూఢిల్లీ, జూలై 29 :**

ముఖ్యమంత్రి రేవంత్.. టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సహా పలువురు నేతలు కాంగ్రెస్ సంస్థాగత వ్యవహారాల ఇంచార్జ్ కేసీ వేణుగోపాల్ తో సమావేశం అయ్యారు. రాష్ట్రంలో ప్రభుత్వం పార్టీ వ్యవహారాల పైన చర్చకు వచ్చింది. సమన్వయం.. లక్ష్యాల సాధన పైన ఆరా తీసారు. ఇదే సమయంలో రాష్ట్రంలో కొనసాగుతున్న సర్ ఓటర్ల ప్రక్రియ పైన ప్రధాన చర్చ జరిగింది. కొందరు నేతలు సర్ పక్రియను నిర్లక్ష్యం చేస్తున్నారనే ఫిర్యాదులు అందాయని వేణుగోపాల్ ఆగ్రహం వ్యక్తం చేసారు.

పార్టీలో భర్తీ చేయాల్సిన పీసీసీ తో సహా ఏ నామినేటెడ్ పదవి అయినా సర్ పక్రియ పూర్తయిన తరువాత మాత్రమే ఆలోచన ఉంటుందని స్పష్టం చేసారు. అందరూ సర్ ప్రక్రియ పూర్తి అయ్యేంత వరకు ఆ కార్యక్రమం పైనే ఫోకస్ చేయాలని తేల్చి చెప్పారు.

పార్టీ నేతలకు దిశా నిర్దేశం ఎవరైనా సర్ పక్రియ పర్యవేక్షణలో నిర్లక్ష్యం వహిస్తే ప్రత్యామ్నాయం చూడాలని నిర్దేశించారు. ఏ ఒక్క ఓటు కూడా నష్టపోకూడదని స్పష్టం చేసారు. తెలంగాణలో బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు చేపట్టిన సంస్థాగత కార్యక్రమాలు, ఎస్ఎస్ఏ (సంఘటన్ సృజన్ అభియాన్) కార్యక్రమాల పురోగతిపై సమగ్రంగా సమీక్షించారు.

సమీక్షలో జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ), మండల కాంగ్రెస్ కమిటీల అధ్యక్షుల పనితీరు, పార్టీ విస్తరణ కార్యక్రమాలపై చర్చ జరిగినట్లు వెల్లడించారు. పార్టీలో సమన్వయానికి సంబంధించిన అంశాలపై కూడా విస్తృతంగా చర్చించినట్లు తెలుస్తోంది.

కాగా.. పార్టీలో నామినేటెడ్ పదవుల భర్తీ అంశం ప్రస్తావనకు రాగా.. సర్ ప్రక్రియ రాష్ట్రంలో పూర్తయిన తరువాత నిర్ణయం తీసుకుందామని వేణుగోపాల్ స్పష్టం చేసినట్లు తెలుస్తోంది.

# మూర్ఖులు ఎవరి మాట వినరు


- విద్యార్థులపై కాల్పులు జరిపించింది హోంమంత్రి,
- ఆర్ఎస్ఎస్ చేతిలో విద్యావ్యవస్థ" లోక్‌సభలో రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు
- రాహుల్ పార్లమెంటరీ మర్యాదను పాటించాలి - కిరణ్ రిజిజు



**జయభేరి, న్యూఢిల్లీ, జూలై 29 :**

పబ్లిక్ ఎగ్జామినేషన్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు, 2026పై జరిగిన చర్చ సందర్భంగా, లోక్‌సభలో హాట్ హాట్ చర్చ జరిగింది. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. హోంమంత్రి అమిత్‌షా, ఆర్ఎస్ఎస్‌పై చేసిన కామెంట్స్‌ను అధికార పార్టీ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆయన క్షమాపణలు చెప్పి వాటిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. దీంతో ఇరు వర్గాల పోటాపోటీ నినాదాలతో సభలో గందరగోళం ఏర్పడింది. రాహుల్ గాంధీ మాట్లాడుతూ, " కేంద్ర హోం మంత్రి అని పిలిచే ఆయనకు ఇక్కడకు వచ్చి కూర్చునే ధైర్యం లేదు. నేను ఆయన వాహనశ్రేణిని చూశాను. అందులో 30 వాహనాలు ఉన్నాయి. కానీ హోం మంత్రి భయపడుతున్నారు, అందుకే ఆయన ఈరోజు ఇక్కడ లేరు.

...మిగతాది 2 లో



# రాజధాని అంటే.. ఆ 29 గ్రామాలే కాదు

- అమరావతి పరిధి మార్పు, కొత్తగా ఈ ప్రాంతాలు సహా - చంద్రబాబు కీలక ప్రకటన..!!

**జయభేరి, అమరావతి :**

ఏపీ సీఎం చంద్రబాబు రాష్ట్ర రాజధాని పై తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. రాజధాని అమరావతి శాశ్వతంగా ఉంటుందని పేర్కొన్నారు. అయితే.. రాజధాని అంటే.. కేవలం 29 గ్రామాలు మాత్రమే కాదని ఆయన పేర్కొన్నారు. విజయవాడ, గుంటూరు కూడా దీనిలో భాగమేనని తెలిపారు. అదేసమయంలో మచిలీపట్నం కూడా దీనిలో భాగంగా ఉంటుందని పేర్కొన్నారు. కేవలం 29 గ్రామాలకు మాత్రమే పరిమితం అయ్యేలా రాజధానిని నిర్మించడం లేదని తెలిపారు. తొలుత అలా అనుకున్నా.. దానిని మార్పు చేశామని ఆయన పేర్కొన్నారు. రాజధాని ప్రాంత అభివృద్ధి అథారిటీ (సీఆర్ డీఏ)పై ఆయన సమీక్షించారు.

...మిగతాది 2 లో



# ముందస్తుగా గుర్తిద్దాం క్యాన్సర్‌ను జయిద్దాం

- మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు

**జయభేరి, సిద్దిపేట :**

విపంచి ఆడిటోరియంలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం ప్రారంభించిన మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు. వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స చేయించుకోవడం కంటే, రాకముందే గుర్తించి నివారించుకోవడం ఉత్తమ మార్గం అని మాజీ మంత్రి బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు స్పష్టం చేశారు. ప్రారంభ దశలో గుర్తింపే క్యాన్సర్‌పై విజయానికి కీలకం అన్నారు. సిద్ధిపేటలోని విపంచి ఆడిటోరియంలో సింధూ హాస్పిటల్ సహకారంతో నిర్వహిస్తున్న రెండు రోజుల ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ. ఆరోగ్యం కంటే గొప్ప సంపద మరొకటి లేదని, వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స కంటే ముందుగానే గుర్తించి నివారించుకోవడం ఎంతో ముఖ్యమని అన్నారు. క్యాన్సర్ కు భయపడాల్సిన

...మిగతాది 2 లో

## మొన్న గద్దర్ అవార్డులు.. ఇప్పుడు పీవీ నరసింహారావు అవార్డులు

7 లో



# ఇన్‌స్టా పరిచయం.. వేధింపులతో నరకం..


- ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి కేసులో సంచలన నిజాలు

**జయభేరి, హైదరాబాద్ :**

తోటి మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణిని వేధించిన కేసులో ఐపీఎస్ శిక్షణ పొందుతున్న ఉదయ్ కృష్ణారెడ్డి (33)ని పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. ఈనాడు కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం ఊళ్లపాలెం గ్రామానికి చెందిన ఉదయ్ కృష్ణారెడ్డి గతేడాది డిసెంబరు నుంచి హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జాతీయ పోలీస్ అకాడమీ (ఎన్‌పీఏ)లో ఐపీఎస్ శిక్షణ పొందుతున్నాడు. గతేడాది మధ్యలో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఒక మహిళ అతడికి పరిచయమైంది. సివిల్స్ సాధించడానికి ఉదయ్ పడిన శ్రమను తెలుసుకున్న సదరు మహిళ అతడిని అభినందిస్తూ మెసేజ్ చేసింది. తాను 2024 బ్యాచ్ ఐపీఎస్‌కు ఎంపికయ్యానని, సెలవులో ఉన్నందున 2025 బ్యాచ్‌తో కలిసి శిక్షణలో చేరనున్నట్లు సదరు మహిళ తెలపడంతో ఇద్దరి మధ్య స్నేహం మొదలైంది. శిక్షణ కాలంలో ఈ పరిచయం కాస్తా మరింత బలపడింది.

**బెదిరింపులు, దుష్ప్రచారం..**

కొంతకాలం బాగానే ఉన్నప్పటికీ, వీరి మధ్య మనస్పర్థలు రావడంతో గొడవలు ప్రారంభమయ్యాయి. సదరు మహిళ తన నుంచి దూరంగా ఉండటాన్ని భరించలేకపోయిన ఉదయ్ కృష్ణారెడ్డి.. తీవ్రస్థాయిలో ఆగ్రహానికి గురయ్యాడు. తాను ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించడమే కాకుండా, ఆయుధాలు చూపి ఆమెను భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నం చేశాడు. సదరు మహిళా అధికారిణిపై అసత్య ప్రచారాలు చేస్తూ ఆమె వ్యక్తిత్వాన్ని, గౌరవాన్ని భంగపరిచేలా ప్రవర్తించాడు. ఇతడి చేష్టలు భరించలేక సదరు మహిళ మరొకరిని వివాహం చేసుకుంది. పెళ్లి తర్వాత కూడా ఉదయ్ వైఖరిలో మార్పు రాలేదు. సోషల్ మీడియా వేదికగా మరింతగా మానసిక వేధింపులకు గురిచేయడం మొదలుపెట్టాడు.



**చట్టపరమైన చర్యలు – రిమాండ్**

వేధింపులు భరించలేని బాధితురాలు ఈ నెల 18న అత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. విచారణలో భాగంగా బుధవారం ఉదయం ఇన్‌స్పెక్టర్ సీతయ్య బృందం నిందితుడిని అశోక్‌నగర్‌లోని అతడి పూర్వ నివాసానికి తీసుకెళ్లి సీన్ రీకన్‌స్ట్రక్షన్ నిర్వహించింది.

**జైలుకు తరలింపు**

దర్యాప్తు అనంతరం ఉదయ్ కృష్ణారెడ్డిని ఉప్పర్‌పల్లి కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం

...మిగతాది 2 లో



# లెక్చరర్ కామెంట్స్

- తట్టుకోలేకపోయి.. విద్యార్థి ఆత్మహత్య

**జయభేరి, మహబూబ్ నగర్, జూలై 29 :**

తడు చదువుల్లో టాపర్. రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ స్కోర్ చేసిన విద్యార్థికి ఇంటర్ ఫస్టియర్‌లో జిల్లాలో రెండో ర్యాంక్ వచ్చింది. కానీ లెక్చరర్ చేసిన తీవ్ర అవమానాన్ని తట్టుకోలేక ఓ టాలెంట్ ఉన్న ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాద సంఘటన జోగులాంబ గద్వాల జిల్లా కొత్తపల్లిలో చోటుచేసుకుంది. కొత్తపల్లి గ్రామానికి చెందిన నేతిబొట్టు తరుణ్ (17) అనే విద్యార్థి గద్వాల

...మిగతాది 2 లో

మొదటిపేజీ తరువాయి

## క్యాన్సర్‌ను జయిద్దాం

అవసరం లేదని, ప్రారంభ దశలో గుర్తిస్తే అనేక రకాల క్యాన్సర్లను పూర్తిగా నయం చేయవచ్చని చెప్పారు. ముఖ్యంగా 40 సంవత్సరాలు దాటిన మహిళలు రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను క్రమం తప్పకుండా చేయించుకోవాలని సూచించారు. కేన్సర్ వ్యాధితో కుటుంబాలు అన్ని రకాలుగా నష్టపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మారిన జీవనశైలి ఆహారపు అలవాట్లు క్యాన్సర్ కేసుల పెరుగుదలకు కారణమవుతున్నాయి అన్నారు. ఈ శిబిరంలో నిర్వహిస్తున్న మామోగ్రామ్, పాప్ స్మియర్ వంటి పరీక్షలు సాధారణంగా ప్రైవేట్ ఆసుపత్రుల్లో వేల రూపాయలు ఖర్చవుతాయని, ఇక్కడ మాత్రం పూర్తిగా ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ప్రతి మహిళ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పొగాకు, గుట్కా, పాన్ మసాలా వంటి అలవాట్లు నోటి క్యాన్సర్‌కు ప్రధాన కారణాలని పేర్కొంటూ, అలాంటి అలవాట్లను కుటుంబ సభ్యులకు మాన్పించే బాధ్యత అందరిదని అన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన హైదరాబాద్ సింధూ హాస్పిటల్ వైద్యులు, వైద్య సిబ్బంది, నిర్వాహకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## ఆ 29 గ్రామాలే కాదు

ఈ సందర్భంగా రాజధాని వ్యవహారంపై వైసీపీ నేతలు చేస్తున్న ప్రచారాన్ని నాయకులు, ప్రభుత్వంలో భాగంగా ఉన్న ఉన్నతాధికారులు కూడా ఖండించాలని ఆయన సూచించారు. ప్రభుత్వం అంటే.. అధికారులు కూడా ఉంటారని.. విధానపరమైన సమస్యలు, విమర్శలు వచ్చినప్పుడు.. ఉన్నతాధికారులు కూడా మీడియా ముందుకు రావాలని చంద్రబాబు సూచించారు. అన్నీ మంత్రులు, ఎమ్మెల్యేలే చూడాల్సిన అవసరం లేదన్నారు. ఈ సందర్భంగా గతంలో ఉన్న తాధికారులు మీడియా ముందుకు వచ్చేవారని.. విధాన పరమైన విషయాలపై వారు వివరణ కూడా ఇచ్చేవారని చంద్రబాబు తెలిపారు. కానీ, ప్రస్తుతం ఐఏఎస్‌లు.. కేవలం కార్యాలయాలకు మాత్రమే పరిమితం అవుతున్నారని.. ఇది సరైన విధానం కాదన్నారు.. రాజధాని వంటి కీలక అంశాలు తెరమీదికి వచ్చినప్పుడు ఆధారాలు, వాస్తవాలతో అధికారులు మీడియాకు వివరిస్తే.. ప్రజలకు ఏం జరుగుతోందో తెలుస్తుందని తెలిపారు. రాజకీయంగా మీరు ఏమీ మాట్లాడాల్సిన అవసరం లేదన్నారు. అది తాము చూసుకుంటామన్నారు. ఇక, నుంచి సీఆర్ డీఏలో అధికార ప్రతినిధులను ఏర్పాటు చేసి మీడియా ముందుకు రావాలని ఆయన సూచించారు.

**నేను సైతం..**

రాజధాని ప్రాంతంలో జరుగుతున్న పనులను తానే స్వయంగాపరిశీలిస్తానని చంద్రబాబు చెప్పారు. ఇప్పటి వరకు మంత్రి నారాయణ మాత్రమే నిత్యం రాజధానిలో పర్యటిస్తున్నారని.. ఇక నుంచి తాను కూడా వారానికి మూడు రోజులు అమరావతిలో పర్యటించి పనులను పరిశీలిస్తానన్నారు. తద్వారా త్వరిత గతిన పనులు పూర్తవుతాయని ఆయన పేర్కొన్నారు. అధికారులు కూడా సాయంత్రం, ఉదయం వేళల్లో పనులు జరుగుతున్న ప్రాంతాలకు వెళ్లాలన్నారు. దీంతో కాంట్రాక్టు సంస్థలు మరింత బాధ్యతతో పనిచేస్తాయన్నారు. రాజధాని విషయంపై వస్తున్న విమర్శలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టే బాధ్యతను ఉన్నతాధికారులు కూడా తీసుకోవాలన్నారు.

## లెక్చరర్ కామెంట్స్

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. బైపీసీ ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఫలితాల్లో 440 మార్కులకు గాను 434 మార్కులు సాధించి జిల్లాలోనే రెండో స్థానంలో నిలిచి తన ప్రతిభను చాటుకున్నాడు.ఈ క్రమంలో కాలేజీలో ఓ మహిళా లెక్చరర్ 435 మార్కులు సాధించగా.. మరొక విద్యార్థితో తరుణ్‌ను పోలుస్తూ, '434 మార్కులు వస్తే నువ్వేమన్నా గొప్పోడివా? నీకంటే ఎక్కువ మార్కులు వచ్చిన వారు కూడా ఉన్నారంటూ' మిగతా విద్యార్థుల ముందే కించపరిచింది. అలా అందరి ముందు నిరుత్సాహపరచడం, అవమానించడం కరెక్ట్ కాదని తరుణ్ ఆమెకు విజ్ఞప్తి చేశాడు. దాంతో విచక్షణ కోల్పోయిన ఆ లెక్చరర్.. "నువ్వేమైనా మంత్రి కొడుకువా? అంతకంటే గొప్పోడివా?" అంటూ తరుణ్ చెంపపై కొట్టి తీవ్రంగా అవమానించినట్లు ఆరోపణలు ఉన్నాయి.

లెక్చరర్ ప్రవర్తనకు తోటి విద్యార్థులందరూ నవ్వడంతో తరుణ్ తీవ్ర ఆవేదనకు, మనోవేదనకు గురయ్యాడు. 2 రోజుల పాటు తీవ్రంగా కలత చెందిన తరుణ్ మంగళవారం నాడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో సూసైడ్ నోట్ రాసి ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. టీచర్లు, లెక్చరర్లు విద్యార్థులను ప్రోత్సహించే విధంగా ఉండాలి తప్ప ఇలా అవమానించకూడదని, సున్నిత స్వభావం ఉన్న ఉన్న వారికి అవమానం జరిగితే ఎంత బాధపడతాడో ఆ లెక్చరర్‌కు తెలియాలని తన సూసైడ్ నోట్‌లో ఆవేదన వ్యక్తం చేశాడు. ఆ లెక్చరర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని, ఈ విషయం ప్రజలందరికీ తెలియాలనే తాను ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు సూసైడ్ నోట్‌లో పేర్కొన్నాడు.

## వేధింపులతో నరకం..

అతనికి 14 రోజుల రిమాండ్ విధించింది. దీంతో పోలీసులు నిందితుడిని చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఈ విషయాన్ని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ అధికారిక ప్రకటన ద్వారా వెల్లడించారు.

**హైకోర్టులో పిటిషన్ – నోటీసులు జారీ**

తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ ఉదయ్ కృష్ణారెడ్డి తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ జె.శ్రీనివాసరావు.. రాష్ట్ర ప్రభుత్వంతో పాటు, ప్రైవేటు ప్రతివాది అయిన మహిళా ట్రైనీ ఐపీఎస్‌కు వ్యక్తిగత నోటీసులు జారీ చేశారు. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ కేసు విచారణను ఆగస్టు 26వ తేదీకి వాయిదా వేశారు. లా అండ్ ఆర్డర్ కాపాడాల్సిన వ్యక్తే ఇలాంటి నేరారోపణల్లో అరెస్ట్ కావడం పోలీస్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

## జూబ్లీహిల్స్ సీఐ సస్పెన్షన్

జయభేరి, హైదరాబాద్, జూలై 29 :

న్యాయం చేస్తారని నమ్మి ఫిర్యాదు చేయడానికి పోలీస్ స్టేషన్‌కు వచ్చిన మహిళని లొంగదీసుకున్నాడు ఓ సీఐ. ఆపై ఆమెతో లైంగిక అవసరాలు తీర్చుకుని, వీడియోలు తీసి వేధిస్తున్నట్లుగా తేలడంతో పోలీస్ శాఖ ఆ సీఐపై వేటు వేసింది. మహిళ వీడియోలు అడ్డం పెట్టుకొని డబ్బులు గుంజుతున్నట్లు గుర్తించిన పోలీసులు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు రెడ్డిపై హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి.సజ్జనర్ సస్పెన్షన్ వేటు వేశారు.

విధి నిర్వహణలో తీవ్ర అలసత్వం వహించడంతో పాటు తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఈ చర్యలు తీసుకుంటూ సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యతలు చేపట్టిన కేవలం 4 నెలల్లోనే ఆయన సస్పెండ్ కావడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.తనకున్న సమస్యపై పోలీస్ స్టేషన్‌కు వచ్చిన బాధితురాలికి ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు రెడ్డి మాయమాటలు చెప్పి లోబరుచుకున్నాడు. ఆమెతో సన్నిహితంగా ఉన్న సమయంలో తన మొబైల్‌లో ఫొటోలు, వీడియోలు తీశాడు. వాటిని సోషల్ మీడియాలో పెడతానని బెదిరిస్తూ పెద్ద మొత్తంలో డబ్బులు డిమాండ్ చేసినట్లు బాధితురాలు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా తనపై పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డాడని, ఆపై అబార్షన్ కూడా చేయించాడని బాధితురాలు తన ఫిర్యాదులో తీవ్ర ఆరోపణలు చేసింది. తనకు న్యాయం చేయాలని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

బాధితురాలి నుంచి వచ్చిన ఫిర్యాదును సీరియస్‌గా తీసుకున్న పోలీసు ఉన్నతాధికారులు సీఐ శ్రీనివాసులు రెడ్డిపై శాఖా పరంగా అంతర్గత విచారణకు ఆదేశించారు. కాగా, తనపై వచ్చిన ఆరోపణలను శ్రీనివాసులురెడ్డి ఖండించారు. బాధితురాలిగా చెప్పుకుంటున్న మహిళే తనను బెదిరించి పలుమార్లు డబ్బులు వసూలు చేసిందని ఆయన ఉన్నతాధికారులకు వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. ప్రాథమిక విచారణ అనంతరం కమిషనర్ సజ్జనార్ సీఐ శ్రీనివాసులు రెడ్డిపై సస్పెన్షన్ వేటు వేశారు.

# పీఓకేలో ఏం జరుగుతోంది




దాదాపు రెండు నెలలుగా కొనసాగుతోన్న ప్రజా ఆందోళనలతో పాక్ ఆక్రమిత కశ్మీర్ అట్టుడుకుతోంది. ఎన్నికలను బహిష్కరిస్తూ చేపట్టిన ఉద్యమం ఉద్రిక్తంగా మారింది. జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ చేపట్టిన లాంగ్ మార్చ్‌కు ముందు భద్రతా బలగాలు, ఆందోళనకారుల మధ్య ఘర్షణలు చోటు చేసుకున్నాయి. ఈ ఘర్షణల్లో కనీసం 20 మంది నిరసనకారులు మృతి చెందారు. పదుల సంఖ్యలో గాయపడ్డారు. ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పాక్ బలగాలు టియర్ గ్యాస్ ప్రయోగించి, గాల్లోకి కాల్పులు జరిపాయి. అయినప్పటికీ జనం వెనక్కి తగ్గలేదు.పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉద్యమాన్ని ఉక్కుపాదం అణచివేయడానికి దాయాది చేయని ప్రయత్నం లేదు. పీఓకేలో ఎన్నికలను బహిష్కరించాలని పిలుపునిచ్చిన స్థానికులపై క్రూరత్వానికి పాల్పడుతోంది. ముజఫర్‌పూర్ లాంగ్ మార్చ్‌కు ముందు నిరసనకారులపై పాకిస్థాన్ సైన్యం జరిపిన కాల్పుల్లో గత 24 గంటల్లో కనీసం 20 మంది కశ్మీరీలు మరణించగా, 50 మందికి పైగా గాయపడ్డారు. రావల్కోట్‌లోని డ్రైక్ వద్ద నిరసనకారులను పాక్ బలగాలు లక్ష్యంగా చేసుకోవడంతో హింస చెలరేగినట్లు సమాచారం. ఎన్నికలను బహిష్కరణకు పిలుపునిచ్చిన జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జేఏఏసీ) కోర్ కమిటీ సభ్యుడు, అధికార ప్రతినిధి ఉమర్ నజీర్ కశ్మీరీ సోదరుడు ఉస్మాన్ నజీర్‌తో సహా 20 మందిని భద్రతా దళాలు హతమార్చినట్లు వర్గాలు తెలిపాయి. దీంతో జూన్ 5 నుంచి పాకిస్థాన్ సైన్యం కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయినవారి సంఖ్య 80కి చేరుకుంది.గుమిగూడి ఉన్న నిరసనకారులపై భద్రతా దళాలు కాల్పులు జరపడంతో మృతదేహాలు రోడ్లపై చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. పీఓకే ఇన్‌ఫ్లూయెన్సర్ అఖీల్ భాయ్ సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ.. మాకు అండగా నిలబడాలని వేడుకున్నాడు. "మిత్రులారా మా పరిస్థితులు చాలా దయనీయంగా మారాయి... రావల్కోట్ మృతదేహాలతో, గాయపడినవారితో నిండిపోయింది.. దేవుడి కోసం, ఈ క్షణంలో మాకు అండగా నిలబడండి.. దయచేసి, మాకు తోడుగా ఉండండి" వేడుకున్నాడు.తృటిలో నేను ప్రాణాలతో బయటపడ్డాను. నా ప్రాణాల గురించి ఇక చింతలేదు.. ఎంతో మంది సోదరులు అమరులైన తర్వాత నేను మీముందుకు వచ్చి చేతులు జోడించి వేడుకుంటున్నాను.. దయచేసి కొంచమైన విచక్షణతో ఆలోచించండి.. ఈ వీడియోను చూస్తున్న అంతర్జాతీయ మీడియాను విజ్ఞప్తి చేసేది ఒకటే.. దయచేసి మాకు మద్దతు ఇవ్వండి. మేము ప్రశాంతమైన ప్రజలం.. లెక్కలేనన్ని మృతదేహాలు, లెక్కలేనంత మంది గాయపడ్డారు. మృతదేహాలను మా భుజాలపై మోసి మోసి అలసిపోయాం" అని ఆవేదన వ్యక్తం చేశాడు.పీఓకేలో ఎన్నికల బహిష్కరణకు పిలుపునిచ్చి, ఉద్యమాన్ని నడిపిస్తున్న జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ నాయకులను పాకిస్థాన్ సైన్యం లక్ష్యంగా చేసుకుంది. సోమవారం నుంచి ఎన్నికల ప్రక్రియ మొదలుకాగా.. భద్రత కోసం 14 వేల మందికిపైగా సైనికులను పీఓకేలో ఇస్లామాబాద్ మోహరించింది. అంతేకాదు, పలు ప్రాంతాల్లో స్నైపర్లను మోహరించగా.. ఆందోళనకారులను చెదరగొట్టడానికి భద్రతా దళాలు నిజమైన తూటాలు, లాంగ్ రేంజ్ టియర్ గ్యాస్ షెల్స్ ఉపయోగిస్తున్నాయని ఆరోపణలు వచ్చాయి.ఐఏఎన్ఎస్ నివేదిక ప్రకారం..గత కొన్నివారాల నుంచి నిరసనలు జరుగుతున్న ఈ ప్రాంతంలో అసమ్మతిని ఉక్కుపాదం అణచివేయడానికి ఆందోళనకారులపై కాల్పులు జరపాలని భద్రతా దళాలను ఆదేశించారు. పీఓకే ప్రజలపై బలప్రయోగంతో పాటు ఇంటర్నెట్, మొబైల్ సేవలను కూడా ప్రభుత్వం నిలిపివేసింది. ఆ ప్రాంతంలోని అనేక చోట్ల విద్యుత్, నీటి సరఫరాను కూడా నిలిపివేశారు.పీఓకే స్థానిక అసెంబ్లీలోని 53 స్థానాలకు గానూ 45 సీట్లకు ఆగస్టు 10 వరకు మూడు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. మిగిలిన 8 స్థానాలకు మహిళలు, టెక్నోక్రాట్స్, మతపెద్దలను నామినేట్ చేస్తారు.పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణపై భారత్ స్పందించింది. పీఓకేలో జరుగుతోన్న మానవహక్కుల ఉల్లంఘనలను బయట ప్రపంచానికి తెలియకుండా కప్పిపుచ్చుకునే ప్రయత్నాల్లో భాగమే ఈ ఎన్నికల నాటకని భారత్ మండిపడింది. ఆక్రమిత ప్రాంతం ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగమేనని స్పష్టం చేసింది. ఈ మేరకు విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ తీవ్ర స్థాయిలో దాయాదిపై విమర్శలు గుప్పించారు.పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో స్థానిక అసెంబ్లీకి ఎన్నికలు జరుగుతున్నాయనే వార్తలను మనం చూశాం.. జమ్మూ కశ్మీర్, లడక్ సహా బలవంతంగా పాక్ ఆక్రమించుకున్న భూభాగం ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగమే. అక్కడ జరుగుతున్న ఎన్నికల తతంగం ఇస్లామాబాద్ ఆక్రమణలను కప్పిపుచ్చుకోవడం, తీవ్ర మానవహక్కుల ఉల్లంఘనల వంటి అకృత్యాలను బయటి ప్రపంచానికి తెలియకుండా చేసే ప్రయత్నమే. ఆర్థిక వనరుల దోపిడీ, ప్రాథమిక హక్కులు హరించడం, అణచివేత వంటి వాటి ఫలితమే ఇటీవల అక్కడ జరుగుతున్న ఉద్యమం" అని రణ్‌ధీర్ జైస్వాల్ పేర్కొన్నారు మైనారిటీలు, వారి సాంస్కృతిక హక్కుల పరిరక్షణలో ఆ దేశానిది అత్యంత చెత్తన రికార్డు.. అలాంటి వారు చేస్తోన్న వ్యర్థ ప్రయత్నాలను మరింత నకిలీవిగా కనబడేలా చేస్తాయి" అని ఆయన అన్నారు. గతేడాది పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేయాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. జులై 27వ తేదీన మిర్పూర్ డివిజన్‌లోని 13 సీట్లకు పోలింగ్ ముగిసింది. ముజఫర్‌బాద్ డివిజన్‌లోని 9తో పాటు శరణార్థులకు కేటాయించిన 12 సీట్లకు ఆగస్టు 2, పూంచ్ డివిజన్‌లోని 11 స్థానాలకు ఆగస్టు 10న పోలింగ్ నిర్వహిస్తారు.

# అడవులను కాపాడుకుందాం

- వన్యప్రాణులను సంరక్షిద్దాం
- మంత్రి కొండా సురేఖ

జయభేరి, హైదరాబాద్ :



పులుల సంరక్షణ పట్ల సమాజంలోని అన్ని వర్గాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. ఈ భూమి కేవలం మనుషుల ఆవాసం మాత్రమే కాదని, సమస్త జీవరాశుల ఉమ్మడి నివాసం అని గుర్తించి ప్రకృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో ముందుకు రావాలని కోరారు. ఈ రోజు అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా దూలపల్లిలోని తెలంగాణ స్టేట్ ఫారెస్ట్ అకాడమీలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ గారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ను మంత్రి పరిశీలించారు. పులుల సంరక్షణకు సంబంధించిన లఘు చిత్రాన్ని మంత్రి వీక్షించారు. ఈ కార్యక్రమంలో అటవీదళాల ప్రధాన సంరక్షణాధికారి వినయ్ కుమార్, కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్ లర్ దండా రాజిరెడ్డి, పిసిసిఎఫ్ (డెవలప్ మెంట్) రత్నాకర్ జౌహరి, సిసిఎఫ్ టిజిఎస్ఎఫ్ఎ డైరెక్టర్ ప్రియాంక వర్గీస్, సిసిఎఫ్ ఎన్ క్షితిజ, టైగర్ సెల్ రీసర్చ్ సైంటిస్ట్ అయాన్ సాధు, అమ్రాబాద్ ఫీల్డ్ డైరెక్టర్ ప్రసాద్, కవాల్ టైగర్ రిజర్వ్ ఫీల్డ్ డైరెక్టర్ శాంతారాం పలువురు అటవీశాఖ అధికారులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జూలై 29న ప్రపంచ పులుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. పులుల సంరక్షణ ప్రాధాన్యతపై ప్రపంచవ్యాప్తంగా అవగాహన పెంపొందించేందుకు 2010లో రష్యాలోని సెయింట్ పీటర్స్ బర్గ్ లో ప్రారంభమైన ఈ కార్యక్రమం నేడు ప్రకృతి పరిరక్షణకు ఒక గొప్ప వేదికగా నిలిచిందన్నారు. పులి అటవీ సంపదకు ప్రతీక అని, పులిని పరిరక్షించడమంటే అడవిని, పర్యావరణాన్ని, జీవవైవిధ్యాన్ని, భావితరాల భవిష్యత్తును పరిరక్షించడమేనని అన్నారు. వేట, అడవుల నరికివేత, అక్రమ రవాణా వంటి కారణాలతో వాటి సంఖ్య తీవ్రంగా తగ్గిపోయిందని మంత్రి సురేఖ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని మార్చేందుకు నాటి ప్రధాని ఇందిరా గాంధి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 1972లో వన్యప్రాణి సంరక్షణ చట్టాన్ని, 1973లో "ప్రాజెక్ట్ టైగర్" ను ప్రారంభించి దేశవ్యాప్తంగా పులుల సంరక్షణకు బలమైన చర్యలు చేపట్టిందని వివరించారు.ఈ చర్యల ఫలితంగానే నేడు భారతదేశం ప్రపంచ పులుల సంరక్షణలో అగ్రగామిగా నిలిచిందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం ప్రపంచంలోని మొత్తం పులుల్లో సుమారు 75 శాతం పులులు భారతదేశంలోనే ఉన్నాయని, దేశంలో ప్రస్తుతం 58 టైగర్ రిజర్వులు విజయవంతంగా పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రానికి కూడా ఈ విషయంలో విశిష్టమైన స్థానం ఉందని మంత్రి అన్నారు. అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వులు దేశంలోనే ప్రాముఖ్యత కలిగిన పులుల అభయారణ్యాలుగా గుర్తింపు పొందాయని మంత్రి తెలిపారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వులో నీటి వనరుల అభివృద్ధి, వాటి ఆవాసాల మెరుగుదల, ఆధునిక రక్షణ చర్యల వల్ల పులుల సంఖ్య గణనీయంగా పెరిగిందని మంత్రి స్పష్టం చేశారు. కవ్వాల్ టైగర్ రిజర్వు లో పులుల సంఖ్యను వృద్ధి చేసేందుకు టైగర్ రీఇంట్రడక్షన్ ను చేపట్టినట్లు మంత్రి సురేఖ తెలిపారు. ఇందులో భాగంగా కవ్వాల్ టైగర్ రిజర్వ్ ను మహారాష్ట్రలోని తడోబా టైగర్ రిజర్వుతో అనుసంధానించి పులుల సహజ సంచారానికి అనుకూల పరిస్థితులు కల్పించినట్లు వివరించారు. దీంతోపాటు ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడం వంటి కార్యక్రమాలను అటవీ శాఖ అమలు చేస్తున్నదని మంత్రి తెలిపారు. అడవులను కాపాడుకుందామని, వన్యప్రాణులను సంరక్షిద్దామని, భావితరాలకు పచ్చని తెలంగాణను అందిద్దామని ఈ సందర్భంగా మంత్రి సురేఖ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా పులుల సంరక్షణకు అటవీ శాఖతో పాటు, ప్రతి పౌరుడు బాధ్యత తీసుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. ఫారెస్ట్ అకాడమీలో శిక్షణ పొందుతున్న మహారాష్ట్ర, ఒడిశా, మధ్యప్రదేశ్, కేరళ రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులను ఉద్దేశించి "అటవీ సంపదను పరిరక్షించడంలో నిబద్ధత, నిజాయితీ, సేవాభావంతో పనిచేసి భావితరాలకు పచ్చని తెలంగాణను అందించాలి" అని మంత్రి దిశా నిర్దేశం చేశారు. అటవీ సంపద, వన్యప్రాణుల సంరక్షణలో విశేష కృషి చేసిన పలువురు అటవీ శాఖ ఉద్యోగులకు ప్రశాంస పత్రం తో పాటు, నగదు బహుమతిని మంత్రి సురేఖ అందించారు. అదే విధంగా అంతర్జాతీయ పులుల సంరక్షణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన చిత్రాలేఖన పోటీలో గెలిచిన విద్యార్థులకు మంత్రి ప్రశంసా పత్రాలు, బహుమతులు అందించారు.

## మూర్ఖులు ఎవరి మాట వినరు

పిల్లలపై పెల్లెట్లు ప్రయోగించారు. పిల్లలకు షాక్ ఇవ్వాలని ఆయన (హోం మంత్రి అమిత్ షా) ఆదేశించారు."రాహుల్ ప్రసంగాన్ని కిరణ్ రిజిజు అభ్యంతరం వ్యక్తం చేశారు. "రాహుల్ ఈ ప్రకటనను ఏ ప్రాతిపదికన చేశారు? మీరు క్షమాపణ చెప్పాలి. వారు విచారణకు డిమాండ్ చేస్తే, మేం అంగీకరిస్తాం. అఖిలేష్, మీరు చెబుతున్నది వేరు. రాహుల్ చెప్పింది తప్పు. నేరుగా ఆయన హోంమంత్రినే ప్రస్తావించారు. దేని ఆధారంగా ఇలాంటి ఆరోపణలు చేశారో చెప్పాలి. లేకుంటే రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలి" అని అన్నారు.రాహుల్ గాంధీ మాట్లాడుతూ, "అంతా ప్రైవేటీకరించారు. వ్యవస్థ ఆత్మను స్వాధీనం చేసుకున్నారు. దాన్ని ఆర్ఎస్ఎస్ ఆక్రమించుకుంది. ధర్మేంద్ర ప్రధాన్ ఎప్పుడూ విద్యా మంత్రిత్వ శాఖను నడపలేదు. దానిని నడిపే వ్యక్తి, సంస్థ ఆర్ఎస్ఎస్. మంత్రి కార్యాలయంలో కూర్చునే ఓఎస్‌డీయే దానిని నడిపే వ్యక్తి. దేశంలోని ప్రతి విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఒక ఆర్ఎస్ఎస్ మనిషే. నిజమైన శత్రువు ఆర్ఎస్ఎస్, ధర్మేంద్ర ప్రధాన్ కాదు."విద్యార్థులు చేస్తున్న పోరాటాన్ని రాహుల్ గాంధీ సమర్థించారు. సభలో ఈ విషయంపై మాట్లాడుతూ ఇలా అన్నారు, "ఒక విద్యార్థి నిజం చెప్పడానికి భయపడడు. ఒక విద్యార్థి ఎవరిపైనా బల ప్రయోగం చేయడు. ఎదుటి వ్యక్తి అభిప్రాయం తన అభిప్రాయానికి భిన్నమైందని వారికి తెలుసు. దీనికి పూర్తిగా వ్యతిరేకంగా మరో వర్గం ఉంది. ఆ వర్గం వారు నిజాలను చెప్పరు. వారికి హింస అంటే ఇష్టం. వారికి అధికారం అంటే ఇష్టం. విద్యా వ్యవస్థ పట్ల విద్యార్థులు చాలా అసంతృప్తిగా ఉన్నారు. కొంతమంది ధనవంతులు పత్రికలను కొనుక్కున్నారు. పేదవారు, నిజాయితీపరులు బాధపడుతున్నారు." అని ఆరోపించారు. రాహుల్ గాంధీ తన ప్రసంగంలో విద్యార్థుల నిరసనలను యువత భావ వ్యక్తీకరణగా అభివర్ణించారు. వారి ఆగ్రహం సమర్థనీయమైందని నొక్కి చెప్పారు. అయితే, అధికార పార్టీ ఆయన ప్రసంగానికి పదే పదే అంతరాయం కలిగించడంతో, బిల్లుపై దృష్టి కేంద్రీకరించాలని స్పీకర్ ఆయనకు సూచించారు. రాహుల్ గాంధీ చేసిన కొన్ని వ్యాఖ్యలలో అపార్లమెంటరీ భాషను ఉపయోగించడంపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కూడా అభ్యంతరం వ్యక్తం చేశారు."ఇది కోపం కాదు, హింస కాదు, ద్వేషం కూడా కాదు. ఇది దేశ యువత, రాబోయే తరం భావవ్యక్తీకరణ. బీజేపీతో సహా అన్ని రాజకీయ పార్టీలు ఈ భావనను గౌరవించాలి." అని రాహుల్ అన్నారు. ఈ విషయంపై బీజేపీ నాయకులు తమ పిల్లల అభిప్రాయాలను అడిగితే, వారికి కూడా విద్యార్థుల నుంచి మద్దతు లభిస్తుందని రాహుల్ గాంధీ అన్నారుకొంతమంది పిల్లలతో తాను మాట్లాడానని, వారు తమ ఆలోచనలు తెలియజేశారని రాహుల్ చెప్పారు. ఈ సందర్భంగా ఒక అమ్మాయిని, "విద్యార్థిగా ఉండటం అంటే ఏమిటి?" అని అడిగానని ఆమె చాలా చక్కని సమాధానం ఇచ్చిందన్నారు. విశాల దృక్పథం కలిగి, తమకు అన్నీ తెలియవని అంగీకరించే వారే విద్యార్థి అని ఆ అమ్మాయి చెప్పింది. 'ఇడియట్' అనే పదంపై అభిప్రాయం ఏంటని విద్యార్థులను అడిగినట్లు పేర్కొన్నారు. ఈ పదాన్ని ఆయన ఉపయోగించడం వివాదంగా మారింది.

**మూర్ఖులు ఎవరి మాట వినరు**

నీట్ పేపర్ లీక్ విషయంపై అవగాహనా పెంచుకోవడానికి బీజేపీ దాని మిత్ర పక్షాలు వారి పిల్లలతో మాట్లాడితే తెలుస్తుందని ఎద్దేవా చేశారు. విద్యార్థి అంటే నిరంతరం విషయాలు తెలుసుకునే వాడని, సత్యం కోసం పరిగెడుతుంటారని అన్నారు. విద్యార్థి విషయం నేర్చుకునేందుకు మన ఇంటి అన్ని ద్వారాలు తెరిచే ఉంటాలని జాతిపిత మహాత్మా గాంధీజీ చెప్పారని గుర్తుచేశారు. కొందరు మూర్ఖులు ఎవరి మాట వినరని, తమకు నచ్చిందే చేస్తూ పోతారంటూ పేపర్ లీక్ ఆందోళనో పాల్గొన్న విద్యార్థులు తనతో చెప్పారంటూ చేసిన వ్యాఖ్యలు లోక్‌సభలో దుమారం రేపాయి.లోక్‌సభలో యాంటీ పేపర్ లీక్ బిల్లుపై జరిగిన వాడీవేడి చర్చలో రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ ఎంపీలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. నీట్ పేపర్ లీకేజీపై ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలిపిన విద్యార్థుల ఆవేదనను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని రాహుల్ గాంధీ విమర్శించారు. విద్యార్థులు, వారి విద్యా వ్యవస్థ, పరీక్షల నిర్వహణపై తనను సభలో మాట్లాడనిచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. సీజేపీ (CJP), విద్యార్థుల నిరసన, ఆందోళనలు అంటే కోపం కాదు, హింస కాదు, ద్వేషం అంతకన్నా కాదన్నారు. అది కేవలం వారికి జరిగిన అన్యాయంపై ఒక భావవ్యక్తీకరణ, ప్రపంచానికి తెలియాల్సిన యువత ఆవేదన అని అన్నారు.కొందరు మూర్ఖులు ఎవరి మాటలు వినరు, వారికి నచ్చిందే చేస్తారని కొందరు విద్యార్థులు తనతో అన్నారని రాహుల్ సభలో సంచలన విషయాలు వెల్లడించారు. సభలో విపక్షనేత రాహుల్ గాంధీ మూర్ఖులు అనే పదాన్ని ఉపయోగించడంపై బీజేపీ, దానిమిత్ర ఎంపీలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. లోక్‌సభలో ఇలాంటి అభ్యంతరకర పదాలు వాడారని రాహుల్ మాటలను వెంటనే రికార్డుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. రాహుల్ వ్యాఖ్యలతో కేంద్రం, విపక్షాల మధ్య సభలో కాసేపు వాగ్వాదం నెలకొంది. ఈ వివాదాస్పద వ్యాఖ్యలను సభా రికార్డుల నుంచి తొలగిస్తున్నట్లు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించడంతో లోక్‌సభలో వివాదం సర్దుమణిగింది.

**రాహుల్ పార్లమెంటరీ మర్యాదను పాటించాలి - కిరణ్ రిజిజు**

కిరణ్ రిజిజు రాహుల్ గాంధీ వాడిన పదజాలంపై ఇలా అన్నారు, "మీరు పార్లమెంటులో అలాంటి మాటలు వాడకూడదు. పార్లమెంటు నియమాలను మేం రూపొందించలేదు. మీరు పార్లమెంటరీ మర్యాదను పాటిస్తే, మేం మీ ప్రసంగాన్ని వింటాం, కానీ దయచేసి మీరు ఉపయోగించిన పదాలను వాడకండి. రాహుల్ గాంధీ తన ప్రసంగాన్ని తిరిగి ప్రారంభించాలని నేను అభ్యర్థిస్తున్నాను." అని అన్నారు. ఇలా అభ్యంతరాలు మధ్య సాగిన లోక్‌సభ వాయిదా పడింది.

# యాదగిరీశుడికి నిత్య పూజల వైభవం

- శ్రీ వారి నిత్యరాబడి రూ.11.58 లక్షలు

**జయభేరి, యాదగిరిగుట్ట, జులై 29:**



తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన శ్రీలక్ష్మి నరసింహ స్వామి వారికి నిత్యపూజలు కొనసాగుతున్నాయి. బుధవారం తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతం, అర్చనను శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలకు అనుమతించారు. శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారిని దర్శించుకున్న భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జరిగిన శ్రీసుదర్శన నారసింహ హోమం,నిత్య కల్యాణం, నిత్య బ్రహ్మోత్సవం, వెండి జోడి సేవ, స్వర్ణ పుష్పార్చన, శ్రీసత్యనారాయణస్వామి వ్రత పూజలలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కొండపైన కొలువైన శ్రీపర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతగుట్ట శ్రీలక్ష్మి నరసింహ స్వామి వారిని దర్శించుకొని ఆలయంలో జరిగిన నిత్యపూజలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**శ్రీనారసింహుడి నిత్యరాబడి..**

శ్రీలక్ష్మి నరసింహ స్వామి వారికి నిత్యరాబడిలో భాగంగా బుధవారం రూ.11,58,891 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రధాన బుకింగ్ ద్వారా రూ.81,700, బ్రేక్ దర్శనం ద్వారా రూ.78,900, శ్రీసత్యనారాయణ స్వామి వ్రత పూజల ద్వారా రూ.67,000,వీఐపీ దర్శనం ద్వారా రూ.1,16,850, కొండపైకి వాహన ప్రవేశం ద్వారా రూ.2,14,000, సువర్ణ పుష్పార్చన ద్వారా రూ.32,200,ప్రసాద విక్రయం ద్వారా రూ.4,40,390, కల్యాణకట్ట ద్వారా రూ.17,000తో పాటు వివిధ శాఖలు,పాతగుట్ట ఆలయం ద్వారా ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.

**నారసింహుడిని దర్శించుకున్న రాజాసింగ్..**

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మి నరసింహ స్వామి వారిని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ దర్శించుకున్నారు. బుధవారం యాదగిరిగుట్టకు వచ్చిన ఆయన శ్రీలక్ష్మి నరసింహ స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేదాశీర్వచనం చేయగా,ఆలయ అధికారులు స్వామి వారి లడ్డు ప్రసాదం, జ్ఞాపకాన్ని అందజేశారు.



## వైటీడీ ఎక్స్అఫీషియో సభ్యుడిగా సీఎస్ సంజయ్ జాజు ప్రమాణస్వీకారం

**జయభేరి, యాదగిరిగుట్ట, జులై 29 :**

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మి నరసింహ స్వామి వారి ఆలయ ఎక్స్అఫీషియో సభ్యుడిగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ప్రమాణస్వీకారం చేశారు. మంగళవారం రాత్రి యాదగిరిగుట్టకు చేరుకున్న ఆయన బుధవారం తెల్లవారుజామున శ్రీలక్ష్మి నరసింహ స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రధానాలయంలోని బంగారు వాకిలి వద్ద ఎక్స్అఫీషియో సభ్యుడిగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో ఆలయ ఈవో భవానీ శంకర్ ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు వేదాశీర్వచనం అందజేయగా, ఆలయ ఈవో భవానీ శంకర్ స్వామి వారి లడ్డు ప్రసాదం, జ్ఞాపికను అందజేశారు. సీఎస్ వెంట స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్ రావు,రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి, దేవస్థానం ఉన్నతాధికారులు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు. అంతకు ముందు సీఎస్‌కు కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్ ఘన స్వాగతం పలికారు. వైటీడీ పాలక మండలి ఇప్పటికే ప్రమాణస్వీకారం చేయగా సీఎస్ సంజయ్ జాజు బుధవారం ప్రమాణస్వీకారం చేశారు.



## దేవరకద్రలో ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు

- షిరిడి సాయి సేవా సమితి అధ్వరంలో సాంప్రదాయ రీతులు పూజలు

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో బుధవారం గురు పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాది ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో గురు పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఈ ఏడాది కూడా దేవాలయంలో షిరిడి సాయి సేవా సమితి ఆధ్వర్యంలో గురు పౌర్ణమి వేడుకలను సాంప్రదాయ రీతిలో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేక కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే అలంకరణ పూజతో పాటు హారతి తదితర పూజా కార్యక్రమాలను కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. విశేష దినోత్సవాన్ని పురస్కరించుకొని స్వామివారిని రకరకాల పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. దీంతో స్వామివారు అలంకరణలో భక్త కోటికి దర్శనం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తుల అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సాయినాథ ఆలయంలో ఎమ్మెల్యేల పూజలు



**జయభేరి, దేవరకద్ర :**


మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో బుధవారం గురు పౌర్ణమి సందర్భంగా స్థానిక సంకల్ప సిద్ధి సాయినాథ ఆలయంలో దేవరకద్ర, వనపర్తి ఎమ్మెల్యేలు జి.మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్), మెఘా రెడ్డిలు పూజలు నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. దేవాలయానికి వచ్చిన వారిని నిర్వహకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం అక్కడ జరిగిన పలు పూజా కార్యక్రమాలలో ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. వారిపై పురోహితులు అంక్షింతలు చల్లి ఆశీర్వచనం పలికారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలను ఎమ్మెల్యేలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మొన్న గద్దర్ అవార్డులు.. ఇప్పుడు పీవీ నరసింహారావు అవార్డులు

- తెలంగాణ ప్రభుత్వం ప్లానింగ్..

**జయభేరి, హైదరాబాద్ :**





సినీ పరిశ్రమకు అవార్డులు అనేవి ఎంతో కొంత ఉత్సాహాన్ని ఇస్తాయి. గతంలో ఏపీ ప్రభుత్వం నుంచి నంది అవార్డులు అధికారికంగా ఇచ్చేవారు. రాష్ట్రం విడిపోయాక ఆ అవార్డులు ఆగిపోయాయి. ఇటీవల తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సీఎం రేవంత్ రెడ్డి గద్దర్ పేరిట రాష్ట్ర అవార్డులు ప్రకటించి ఇస్తున్నారు. తెలంగాణ గద్దర్ అవార్డులు అంటూ సినీ పరిశ్రమకు తెలంగాణ ప్రభుత్వం తరపున అవార్డులు ఇస్తున్నారు. అయితే ఇప్పుడు పీవీ నరసింహారావు పేరిట టీవీ పరిశ్రమకు కూడా తెలంగాణ ప్రభుత్వం అవార్డులు ఇవ్వాలని ప్లాన్ చేస్తుంది. తాజాగా తెలంగాణ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి టెలివిజన్ అవార్డు కమిటీని ఏర్పాటు చేసి అవార్డుల రూపకల్పనపై చర్చలు జరిపారు. అవార్డు లోగో, పేరు, కేటగిరీలు, ఎంపిక విధానం వంటి అంశాలపై కమిటీ సభ్యులతో చర్చించారు. ఈ సమావేశంలో మంత్రి కోమటి రెడ్డి మాట్లాడుతూ.. అవార్డుల పేరు, లోగో తెలంగాణ ఆత్మను ప్రతిబింబించేలా ఉండాలని, మాజీ ప్రధాన మంత్రి, తెలంగాణ ముద్దుబిడ్డ పీవీ నరసింహారావు పేరును బుల్లితెర అవార్డులకు పెట్టాలని ప్రతిపాదించారు. దీనిపై సీఎం రేవంత్ రెడ్డితో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని, ఈ అవార్డుల ఎంపిక పూర్తిగా పారదర్శకంగా ఉంటుందని అన్నారు. ప్రేక్షకులకు వినోదంతో పాటు సామాజిక సందేశాలను కూడా టెలివిజన్ రంగం అందిస్తుంది. నటీనటులు, దర్శకులు, రచయితలు, సాంకేతిక నిపుణులు, యాంకర్లు, నిర్మాతలు, బాలల కార్యక్రమాలు, సామాజిక సందేశంతో కూడిన సీరియల్స్.. ఇలా అన్ని విభాగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి ప్రోత్సహించేలా కేటగిరీలను రూపొందించాలని కమిటీకి తెలిపారు. అలాగే ఈ టీవీ అవార్డుల ప్రదానోత్సవాన్ని సినిమా అవార్డుల లాగే ఘనంగా నిర్వహిస్తామని అందుకు 2 లేదా 3 వేదికలు కూడా ప్రతిపాదించాలని కమిటీ సభ్యులను కోరారు మంత్రి. దీంతో త్వరలోనే పీవీ నరసింహారావు పేరిట టెలివిజన్ అవార్డులు ఇవ్వబోతున్నట్టు తెలుస్తుంది.

# ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

**జయభేరి, యాదగిరిగుట్ట:**




యాదగిరిగుట్ట పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాలలో గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుధవారం గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని యాదగిరిగుట్ట పట్టణంలో షిర్డీ సాయిబాబా ట్రస్ట్, సౌభాగ్య రిసార్ట్‌స్‌తో పాటు తదితర ఆలయాలలో జరిగిన గురు పౌర్ణమి వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పాతగుట్ట శ్రీ షిర్డీ సాయిబాబా ట్రస్ట్ ఆలయ ప్రధానార్చకుడు ఆరుట్ల రాఘవాచార్యులు ఆధ్వర్యంలో సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయిబాబాను వివిధ రకాల పుష్పాలతో అలంకరించి అభిషేకాలు,పూజలు, పారాయణాలు నిర్వహించారు. గురుపౌర్ణమి సందర్భంగా ఉదయం కాకడ హారతి, మేలుకొలుపు,గోత్రనామాల అర్చనలు,భక్తులచే 108 లీటర్ల పాలతో అభిషేకం జరగగా,సాయంత్రం సాయి సత్ చరిత పారాయణం వేదోక్తంగా జరిగాయి.

రాత్రి పల్లకీ సేవ నేత్రపర్వంగా నిర్వహించగా,భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రతి గురువారం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భారీగా తరలివచ్చిన భక్తులు గురుపౌర్ణమి వేడుకల్లో పాల్గొని సాయిబాబును దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన భక్తుడు బంగారం రాజు మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం వ్యాస గురుపౌర్ణమి సందర్భంగా ఆరుట్ల రాఘవచార్యుల ఆశీస్సులతో యాదగిరిగుట్ట షిరిడీ సాయినాథుడి క్షేత్రాన్ని సందర్శిస్తున్నట్లు తెలిపారు. సాయినాథుడి అనుగ్రహంతో తాను కోరుకున్న కోరికలు, అనుకున్న పనులు సకాలంలో నెరవేరాయని పేర్కొన్నారు. గురుపౌర్ణమి సందర్భంగా ప్రతి ఏడాది అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా సాయినాథుని క్షేత్రంలో గురుదత్త స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని కూడా తన సొంత ఖర్చులతో చేపట్టినట్లు వెల్లడించారు.

## విద్యారంగంలో పాలమూరు జిల్లా ప్రథమ స్థానంలో నిలవాలి

- జిల్లా అడిషనల్ కలెక్టర్ మధు సూధన్ నాయక్

**జయభేరి, దేవరకద్ర :**



విద్యాభివృద్ధిలో పాలమూరు జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు ఇక మీదట ప్రభుత్వ పాఠశాలల పర్యవేక్షణ నిరంతరం జరుగుతుందని జిల్లా అడిషనల్ కలెక్టర్ మధు సూదన్ నాయక్ వెల్లడించారు. మండల స్థాయి ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమంలో భాగంగా బుధవారం మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర లోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఉపాధ్యాయ శిక్షణ శిబిరాన్ని జిల్లా అడిషనల్ కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులనుద్దేశించి మాట్లాడుతూ ప్రతి రోజు తాను స్వయంగా పాఠశాలలను పర్యవేక్షిస్తానని అన్నారు. విధి నిర్వహణలో ఉపాధ్యాయులు బాధ్యతయుతంగా పనిచేస్తూ విద్యా ప్రమాణాలు పెంపొందించాలని సూచించారు. విధి నిర్వహణ విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించిన చర్యలు తప్పవన్నారు.విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి యే లక్ష్యంగా ప్రతి చిత్త శుద్ధితో పనిచేయాలన్నారు.ఈ కార్యక్రమంలో యం పి డి ఓ శ్రీనివాస్ రావు, యం ఈ ఓ బలరామ్, జి హెచ్ యం రమేష్, ఆర్ పి లు శ్రీనివాస్ రెడ్డి, పవన్ కుమార్, శంకర్ నాయక్, నాగరాజు, ఉపాధ్యాయులు అశ్విని చంద్రశేఖర్, రఘు వర్ధన్ రెడ్డి, శ్రీకాంత్ యాదవ్, నాగేశ్వర్ రెడ్డి, డి. అజయ్, సుదర్శన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సాయిబాబా ఆలయంలో ఎమ్మెల్యే సోదరుడి పూజలు



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) సోదరుడు జి.భాస్కర్ రెడ్డి బుధవారం సాయిబాబా ఆశీస్సులు తీసుకున్నారు. గురు పౌర్ణమి పురస్కరించుకొని సాయిబాబా ఆలయంలో భాస్కర్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడ జరిగిన పలు పూజా కార్యక్రమాలలో కూడా ఆయన పాల్గొన్నారు. దీంతో పురోహితులు భాస్కర్ రెడ్డి పై అంక్షింతలు చెల్లి ఆశీర్వచనం పలికారు. తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆనాడు కాంగ్రెస్ చేసిన కృషి వల్లనే నేడు పుష్కలంగా సాగునీరు

- దేవరకద్ర, వనపర్తి ఎమ్మెల్యేలు జిఎంఆర్, మేఘారెడ్డి
- భీమా ఫేజ్-1... స్టేజ్ -1 పంప్ హౌస్ల నుండి దిగువకు నీటి విడుదల



**జయభేరి, దేవరకద్ర :**

ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వంలో నిర్మించిన ప్రాజెక్టుల వల్లనే నేడు ఉమ్మడి పాలమూరు జిల్లాలోని రైతాంగానికి పుష్కలంగా సాగునీరు, తాగునీరు అందుతుందని ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర, వనపర్తి ఎమ్మెల్యేలు జి.మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) మెఘా రెడ్డిలు అన్నారు. దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని కొత్తకోట మదనాపురం మండలాల శివారులోని భీమా పేజ్ వన్ స్టేజ్ వన్ పంపు హౌస్ లో నుండి బుధవారం అధికారులతో కలిసి వారు దిగువకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడారు.భీమా ఫేజ్ 1 పంప్ హౌస్ నుంచి దిగువకు నీటిని విడుదల చేయడం సంతోషంగా ఉందన్నారు. ఎగువన కర్ణాటక నుండి జూరాల వస్తున్న వరదను దృష్టిలో ఉంచుకొని, ఎప్పటికప్పుడు జూరాలలో ఉన్న నీటి మట్టాన్ని తెలుసుకుంటూ, రైతుల వ్యవసాయ అవసరాలను దృష్టిలో ఉంచుకొని మొన్న కోయిల్ సాగర్ కు ఉంద్యాల పంప్ హౌస్ నుండి నీటిని విడుదల చేయడం జరిగిందని, నేడు భీమా ఫేజ్ 1... స్టేజ్ 1 పంప్ హౌస్ నుండి దిగువకు నీటిని విడుదల చేయడం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం లో నిర్మించిన ప్రాజెక్టుల వల్లనే నేడు ఉమ్మడి పాలమూరు జిల్లాలో రైతాంగానికి సాగునీరు, తాగునీరు అందుతుందని ఎమ్మెల్యేలు జిఎంఆర్, మెఘారెడ్డిలు అన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌నినోతో రైతులు అప్రమత్తం కావాలి



**జయభేరి, తుర్కపల్లి, జూలై 29 :**

తుర్కపల్లి మండలం దత్తాయపల్లి గ్రామంలోని రైతు వేదిక నందు ఎల్ నినో వాతావరణ పరిస్థితులపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విత్తనమేల కార్యక్రమాన్ని నిర్వహించారు అనంతరం మండల వ్యవసాయ అధికారిని శ్రీ ఉమా మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో వర్షపాతం సాధారణ కంటే తక్కువగా ఉండే అవకాశం ఉన్నందున రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని మెట్ట పంటల సాగుకు ప్రాధాన్యత నివ్వాలని అన్నారు. రైతులు అధిక నీటి అవసరం ఉన్న పంటలకు బదులు స్థానిక పరిస్థితులను అనుకూలమైన వర్షాధార పంటలను ఎంపిక చేసుకోవడం ద్వారా నష్టాలను తగ్గించవచ్చని అన్నారు. వర్షాభావ పరిస్థితుల వలన రైతులు కాలికంగా పండే కందులు మినుములు, కూరగాయలను వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వేల్పు పెల్లి సర్పంచ్ గుండా సిద్ధులు, దత్తాయపెల్లి గ్రామ ఉప సర్పంచ్ జిట్ట బాలకృష్ణ, వెల్పుపల్లి ఉపసర్పంచ్ ఏనుగు సిద్ధులు, వ్యవసాయ విస్తరణ అధికారి ఉమారాణి ,రైతులు పాల్గొన్నారు.



## ఆచార్య సింగిరెడ్డి నారాయణరెడ్డి (సినారె) జయంతి

**దేవరకొండ :**

మునగాల కొండల్ రావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్), దేవరకొండ లో తెలుగు విభాగం ఆధ్వర్యంలో ఆచార్య సింగిరెడ్డి నారాయణరెడ్డి (సినారె) జయంతిని పురస్కరించుకొని కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామావత్ రవి మాట్లాడుతూ సాహిత్యాన్ని విద్యార్థులందరూ చదవాలని సాహిత్యం ద్వారా మనం ఎన్నో ఉన్నతమైన విలువలను నేర్చుకుంటామని పేర్కొన్నారు.అలాగే సినారె సాహిత్యంలోని అంశాల్ని సమాజానికి అన్వయిస్తూ అనేక విషయాల పైన మాట్లాడుతూ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ & తెలుగు విభాగాధిపతి జి.కోటయ్య, అకాడమిక్ కోఆర్డినేటర్ సి. లింగమయ్య, డా. వి. మకట్లాల్, తెలుగు అధ్యాపకులు ఏ.శ్రీను తదితర అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గురుసంత్ శ్రీ రవిదాస్ మహారాజ్ జయంతి వేడుకలు



**దేవరకొండ :**

గురుసంత్ శ్రీ రవిదాస్ మహారాజ్ 650వ జయంతి మహోత్సవాన్ని పురస్కరించుకుని భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా గురు సంతు రవిదాస్ కార్యక్రమాల దేవరకొండ నియోజకవర్గం ఇన్చార్జ్ చిత్రం ఉదయ్ ఆధ్వర్యంలో స్థానిక టీటీడీ కళ్యాణ మండపంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురుసంత్ శ్రీ రవిదాస్ మహారాజ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. నిర్వహించిన సభలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు అంకురి నరసింహ మాట్లాడుతూ, గురుసంత్ రవిదాస్ మహారాజ్ సమానత్వం, సామాజిక న్యాయం, మానవతా విలువలకు ప్రతీకగా నిలిచిన మహనీయులని అన్నారు. కుల, మత భేదాలకు అతీతంగా సమాజంలో ఐక్యత, సోదరభావం పెంపొందించాలని ఆయన బోధించిన సందేశాలు నేటి తరానికి ఎంతో ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. వారి ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టి సమాజాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బెజవాడ శేఖర్, నక్క వెంకటేష్ యాదవ్ బిజెపి జిల్లా ఐటీ సెల్ కన్వీనర్ జల్దా భాస్కర్, జిల్లా కౌన్సిల్ మెంబెర్ గుండాల అంజయ్య జిల్లా కార్యవర్గ సభ్యులు ఎర్ర బిక్షపతి మండల అధ్యక్షులు నాగిళ్ల ఆంజనేయులు రెడ్డి శంకర్ చండీశ్వర్ కొమ్ము వెంకటయ్య నాగిళ్ల సైదులు నేతాల వెంకటేష్ యాదవ్ కాసుల శంకరయ్య బెజవాడ శేఖర్ దేవరకొండ టౌన్ జనరల్ సెక్రటరీలు సముద్రాల సహదేవ్ బిక్కు రాపోలు శీను దసరత్ నాయక్ కాటమోని బన్నీ తదితర ముఖ్య కార్యకర్తలు భారతీయ జనతా పార్టీ నాయకులు, ఎస్సీ మోర్చా నాయకులు, కార్యకర్తలు మరియు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొని గురుసంత్ శ్రీ రవిదాస్ మహారాజ్ కి ఘన నివాళులర్పించారు.

## షిరిడి సాయిబాబా దేవాలయంలో గురు పౌర్ణమి వేడుకలు



**దేవరకొండ :**

శ్రీ షిరిడి జ్ఞాన సరస్వతి ఆలయంలో గురు పౌర్ణమి సందర్భంగా ఆలయ కమిటీ వారు గురు పౌర్ణమి ఉత్సవాలను వైభవంగా నిర్వహించినారు. ఉదయం ఐదు గంటలకు కాకడ హారతి నిత్య అభిషేక కార్యక్రమం, ఉదయం ఎనిమిది గంటలకు జలం క్షీరాభిషేకం, 9:30 నిమిషాలకు గీత సత్సంగం ఆధ్వర్యంలో భగవద్గీత పారాయణం, 11 గంటలకు పుష్పములతో వేద వ్యాస అష్టోత్తర పూజ, 11 గంటల 30 నిమిషాలకు విష్ణు సహస్రనామ పూజ,12 గంటలకు మధ్యాహ్న హారతి, సాయంత్రం పల్లకి సేవ కార్యక్రమాలు నిర్వహించినారు వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదములు అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## గుడిపల్లి గ్రామపంచాయతీలో గ్రామసభ



**గుడిపల్లి :**

గుడిపల్లి గ్రామపంచాయతీలో విజయవంతంగా గ్రామసభ నిర్వహించడం జరిగింది తెలంగాణ జలసరిజలసంచయ్ కార్యక్రమంపై గ్రామసభ నిర్వహించడం జరిగింది ఇట్టి గ్రామసభను ఉద్దేశించి గ్రామ సర్పంచ్ కున్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ నీటి వనరుల పరిరక్షణ, భూగర్భ జలాల పెంపు, తాగునీటి సమస్యలపై చర్చించినట్లు పేర్కొన్నారు ఇట్టి కార్యక్రమంలో గ్రామానికి సంబంధించిన అన్ని విభాగాల ప్రభుత్వ ఉద్యోగులు ప్రజా ప్రతినిధులు గ్రామ సెక్రెటరీ విజయ్ రెడ్డి ఉప సర్పంచ్ అర్వపల్లి శ్రీనయ్య వార్డు సభ్యులు గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేశారని తెలియజేశారు.

# పూలు చల్లి, ఫొటోలకు ఫోజులు తప్ప బిఆర్ఎస్ చేసింది ఏమీ లేదు

**దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి విమర్శ**

**రామన్ పాడు రిజర్వాయర్ వద్ద వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి తో కలిసి సరళ సాగర్ ఎత్తిపోతల పథకం నుండి మోటార్ల ద్వారా సరళ సాగర్ ప్రాజెక్టుకు నీటి విడుదల**



**దేవరకద్ర :**

బిఆర్ఎస్ నాయకులు ప్రాజెక్టుల యాత్ర పేరుతో విహారయాత్రలు చేశారని మహబూబ్ బ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) విమర్శించారు. దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని మదనాపురం మండలం లోని రామన్ పాడు రిజర్వాయర్ వద్ద ఉన్న సరళా సాగర్ ఎత్తిపోతల పథకం నుండి బుధవారం వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి తో కలిసి మోటార్ల ద్వారా ప్రాజెక్టుకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడారు.పదేళ్లు అధికారంలో ఉండి, బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు, మంత్రులు పాలమూరు జిల్లా ప్రాజెక్టులను పట్టించుకోలేదని ఆరోపించారు. బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లు పాలించి ఉమ్మడి పాలమూరు జిల్లాకు అదనంగా ఒక్క ఎకరాకు సాగునీరు ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో నిర్మించిన ప్రాజెక్టులు, రిజర్వాయర్ల వల్లనే ఉమ్మడి పాలమూరు జిల్లాకు సాగునీరు, తాగునీరు అందుతుందన్నారు. పదేళ్లు అధికారంలో ఉండి కాంగ్రెస్ కట్టిన ప్రాజెక్టులు, రిజర్వాయర్ల వద్ద నీళ్లు వదిలి, పూలు చల్లి, ఫోటోలకు ఫోజులు ఇవ్వడం తప్ప జిల్లాకు బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు, మంత్రులు చేసిందేమీ లేదని విమర్శించారు. మూడేళ్లలో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తామని ప్రగల్భాలు పలికి, పదేళ్లలో అధికారంలో ఉండి పాలమూరు రంగారెడ్డి పూర్తి చేయలేదన్నారు. బిఆర్ఎస్ నాయకులు పదే,పదే మాట్లాడుతున్న పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు బీజమే వేసింది కాంగ్రెస్ పార్టీ అని అన్నారు.

ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం జూరాల సోర్స్ గా, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు రూపకల్పన చేసిందన్నారు. పదేళ్ల పాలనలో ఒక్క నాడు కూడా కేసీఆర్ పాలమూరు రంగారెడ్డి పై రివ్యూ నిర్వహించలేదన్నారు. జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, మంత్రులు, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేయాలని కేసీఆర్ పై ఒత్తిడి చేయలేదన్నారు. 2016 లో బిఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్ట్ ను నిర్మించింది, నిర్మించిన కొద్ది రోజులకే ప్రాజెక్టు కూలిపోయిందన్నారు. ఒక్క పాలమూరురంగారెడ్డినే కాదు ఉమ్మడి పాలమూరు జిల్లాలో అన్ని ప్రాజెక్టులను పూర్తి చేస్తాం, పాలమూరు ముద్దుబిడ్డ రేవంత్ రెడ్డి నాయకత్వంలో పాలమూరు జిల్లాను సస్యశ్యామలం చేస్తామన్నారు. పదేళ్లు అధికారంలో ఉండి బిఆర్ఎస్ ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే శంకర సముద్రం ను కనీసం పట్టించుకున్న పాపాన పోలేదని ఎమ్మెల్యే జిఎంఆర్ విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజాప్రతినిధులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వెంకటేశ్వర స్వామి కళ్యాణ.. కమనీయం

**వంశపారంపర్య ధర్మకర్త మధుసూదన్ కుమార్ ఆధ్వర్యంలో కళ్యాణం మహోత్సవం**



**దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా లోని ప్రధాన పుణ్య క్షేత్రమైన మన్యంకొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఈ పవిత్ర పుణ్య కార్యక్రమాన్ని సాంప్రదాయ రీతిలో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి దంపతులను గర్భగుడి నుండి శోభాయ మానంగా అలంకరించిన పల్లకిలో దేవస్థానం ముందున్న రథమండపం వరకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. భక్తుల హరినామశ్చరణ, పురోహితుల వేద మంత్రాలు, సన్నాయి వాయిద్యాల మధ్య ఈ ఊరేగింపు ముందుకు కదిలింది. అనంతరం రథ మండపంలో స్వామి కళ్యాణ మహోత్సవాన్ని దేవస్థానం చైర్మన్, వంశపారంపర్య ధర్మకర్త అళహరి మధుసూదన్ కుమార్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అశేష భక్త జనావళి తిలకిస్తుండగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. సాంప్రదాయ రీతిలో తలంబ్రాల ఘట్టాన్ని నిర్వహించారు. స్వామివారి కళ్యాణ మహోత్సవాన్ని తిలకించడానికి జిల్లా నలుమూలల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. విశేష దినోత్సవం సందర్భంగా దేవస్థానం వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేశారు. కళ్యాణ మహోత్సవం అనంతరం తిరిగి స్వామి దంపతులను పల్లకిలో గర్భగుడిలోకి తీసుకెళ్లి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్, వంశపార పర్య ధర్మకర్త అళహరి మధుసూదన్ కుమార్, అళహరి రామకృష్ణ,ఈఓ శ్రీనివాసరాజు, ప్రధాన పూజారులు రాజేష్, నరసింహయ్య,దేవస్థానం పురోహితులు, సిబ్బంది, వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

**మీడియాకు వివరాలు తెలిపిన ఫ్యూచర్ సిటీ కమిషనర్ తరుణ్ జోషి**

**షాద్ నగర్, జులై 29 :**



రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గము కేశంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠాను పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలోని కేశంపేట, కడ్తాల్, మహబూబ్‌నగర్ తదితర ప్రాంతాల్లో జరిగిన చైన్ స్నాచింగ్, ద్విచక్ర వాహనాల చోరీ కేసుల్లో నిందితులుగా ఉన్న ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు ఫ్యూచర్ సిటీ కమిషనర్ తరుణ్ జోషి మీడియాకు తెలిపారు. షాద్ నగర్ డిసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. స్థానిక డిసిపి శిరీష రాఘవేంద్ర, ఏసిపి లక్ష్మీనారాయణ, కేశంపేట సీఐ నరహరి తదితరులు మీడియా సమస్యలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ తరుణ్ జోషి మాట్లాడుతూ..సుమారు 7 తులాల బంగారు గొలుసులు, మూడు మొబైల్ ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనం, రెండు కత్తులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. పంజాబ్ రాష్ట్రానికి చెందిన సుఖ్‌దేవ్ సింగ్ (38), షమ్షేర్ సింగ్ (36), మన్‌ప్రీత్ సింగ్ (24) హార్వెస్టర్ డ్రైవర్లు, కూలీలుగా పనిచేస్తూ తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాలపై అవగాహన పెంచుకున్నారు. స్థానిక రహదారులు, గ్రామాలు, మార్గాలు, తప్పించుకునే దారులపై పరిచయం ఏర్పడటంతో సులభంగా డబ్బు సంపాదించేందుకు చైన్ స్నాచింగ్, ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. వృద్ధురాలి మెడలోని 4 తులాల బంగారు పుస్తెలతాడు అపహరణ.జూలై 25న కేశంపేట మండలం సంతాపూర్ గ్రామ శివారులో ఓ వృద్ధురాలు తన మనవరాలితో కలిసి వెళ్తుండగా.. మోటార్‌సైకిల్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు దారి అడిగినట్లు నటించి, ఒక్కసారిగా ఆమె మెడలోని 4 తులాల బంగారు పుస్తెలతాడును లాక్కొని పరారైనట్లు పోలీసులు తెలిపారు. అదే రోజు కడ్తాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోనూ మరో మహిళను బెదిరించి, కింద పడేసి ఆమె మెడలోని 3 తులాల బంగారు పుస్తెలతాడును అపహరించినట్లు విచారణలో వెల్లడైంది.

మరో కేసులో చోరీ చేసిన బైక్‌తోనే చైన్ స్నాచింగ్ జూన్ నెలలో కొత్తకోట ప్రాంతంలో ద్విచక్ర వాహనాన్ని చోరీ చేసి, అదే వాహనంతో చైన్ స్నాచింగ్‌కు పాల్పడినట్లు నిందితులు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం చోరీ చేసిన బంగారు ఆభరణాలను విక్రయించి డబ్బును పంచుకున్నట్లు వెల్లడించారు. జూలై 23న నాందేడ్ నుంచి సికింద్రాబాద్‌కు రైలులో వచ్చిన నిందితులు, అక్కడి నుంచి మరోసారి నేరాలకు పాల్పడేందుకు సిద్ధమైనట్లు పోలీసులు పేర్కొన్నారు. జూలై 24న మహబూబ్‌నగర్ రైల్వే స్టేషన్ సమీపంలోని ఎస్‌బీఐ ఏటీఎం వద్ద పార్క్ చేసిన హోండా సీడీ100 ద్విచక్ర వాహనాన్ని చోరీ చేసి, దానితో కేశంపేట, కడ్తాల్ ప్రాంతాల్లో చైన్ స్నాచింగ్‌లకు పాల్పడినట్లు తెలిపారు. కేశంపేట ఎక్స్ రోడ్డులో అరెస్ట్ .మరో చైన్ స్నాచింగ్‌కు సిద్ధమవుతున్న సమయంలో విశ్వసనీయ సమాచారం మేరకు జూలై 29న కేశంపేట ఎక్స్ రోడ్డు వద్ద ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. విచారణలో కేశంపేట, కడ్తాల్, మహబూబ్‌నగర్ టౌన్, కొత్తకోట పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన పలు కేసులకు సంబంధించి నిందితులు తమ ప్రమేయాన్ని అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. కేసు ఛేదనలో ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డా. తరుణ్ జోషి పర్యవేక్షణలో, షాద్‌నగర్ డివిజన్ డీసీపీ షిరీష రాఘవేంద్ర, ఏసీపీ. లక్ష్మీనారాయణ, కేశంపేట సీఐ బి. నరహరి, ఎస్ఐ టీ. రాజ్‌కుమార్, కేశంపేట పోలీస్ సిబ్బంది, జోనల్ క్రైమ్ టీమ్ కీలకంగా పనిచేసినట్లు ప్రకటనలో పేర్కొన్నారు.






## పట్టణంలో మంచినీటి సమస్య ఉండకూడదు

**సర్పంచ్ పసునూరి యుగేంధర్ రెడ్డి**

**కొండమల్లేపల్లి :**

కొండమల్లేపల్లి పట్టణం 13వ వార్డులో ఇంటి అవసరాల నిమిత్తం నీళ్ల కోసం ప్రజలు వార్డు మెంబర్ పర్వతం కొండల్ ని సంప్రదించగా ఈ విషయం కొండమల్లేపల్లి సర్పంచ్ పసునూరి యుగేందర్ రెడ్డి దృష్టికి తీసుకురావడం జరిగింది. ఇట్టి విషయంపై వెంటనే స్పందించి... బోరు బండి వాహనంతో నూతన బోరు ఏర్పాటు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. బోర్ పాయింట్ వద్ద కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ పర్వతం కొండల్, వస్కుల స్వప్న శ్రీను కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## హైడ్రా కు మద్దతుగా ర్యాలీ

**మేడ్చల్ :**

హైడ్రా కు మద్దతుగా శేర్లింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జగదీశ్వర గౌడ్.. మెట్టు సాయికుమార్ చైర్మన్ ఫిషర్మెన్ ఆధ్వర్యంలో తమ్మడి కుంట చెరువు వద్ద ర్యాలీ నిర్వహించారు. వర్షం కూడా లెక్క చేయకుండాన హైడ్రా కమీషనర్ రంగనాధ్ మద్దత్తు దారులు వచ్చారు. చుట్టుపక్క కాలనీవాసులు హైడ్రా కమీషనర్ రంగనాధ్ కి మద్దతు తెలిపారు. హైడ్రా వల్ల వర్షాకాలం ఇబ్బందులు తప్పాయని కాలనీ వాసులు అన్నారు. హైడ్రా ఉండాల్సిందేనని నినాదాలు చేసారు.

## కల్తీ పన్నీరు పట్టివేత

**మేడ్చల్ :**

చెర్లపల్లి నుంచి నాగారం వెళుతున్న రెండు ఆటోలను మల్కాజ్‌గిరి ఎస్వోటీ పోలీసులు అడ్డగించారు. వాటినుంచి 300 కిలోల కల్తీ పన్నీరును స్వాధీనం చేసుకున్నారు. యాదాద్రి జిల్లాకు చెందిన సతీష్, అనిల్ లను నిందితులుగా గుర్తించారు.

## చర్లపల్లి ఇండస్ట్రియల్ ఏరియాలో భీభత్సం..



**జయభేరి, మేడిపల్లి :**

చర్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని చర్లపల్లి పారిశ్రామికవాడలోని సుదర్శన ఇండస్ట్రీస్ లో ఘోర ప్రమాదం, సీఎన్సీ లేజర్ మిషన్ లో ఇరుక్కుని కార్మికుడు మృతి. శ్రీకాకుళానికి చెందిన బి.సురేష్(42) అనే కార్మికుడు లేజర్ మిషన్ వద్ద పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు లేజర్ మిషన్ మెడకు తగిలి తల మొండెం వేరైన ఘటన తీవ్రంగా కలకలం రేపింది, తోటి కార్మికులు కాపాడే లోపే సురేష్ తల తెగి పడిన వైనం, కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్న చర్లపల్లి పోలీసులు.



# వర్షాకాలంలో బట్టల దుర్వాసనతో ఇబ్బందా?

**వర్షాకాలంలో దుస్తులు త్వరగా ఆరకపోవడం, వాటి నుంచి దుర్వాసన రావడం చాలా సాధారణం. తేమతో కూడిన వాతావరణం వల్ల ఈ సమస్య ఎదురవుతుంది. అయితే, కొన్ని సులభమైన చిట్కాలను పాటిస్తే, ఈ దుర్వాసనను సులభంగా దూరం చేసుకోవచ్చు. వర్షాకాలం వచ్చిందంటే చాలు, వాతావరణం చల్లగా, తేమగా మారుతుంది. ఈ సమయంలో దుస్తులు ఆరడానికి చాలా సమయం పడుతుంది.**

మూడు, నాలుగు రోజులు గడిచినా బట్టలు తడిగా ఉండిపోవడం, వాటి నుంచి చెడు వాసన రావడం చాలామందికి ఎదురయ్యే సమస్య. ఎంత పెర్ఫ్యూమ్ కొట్టినా ఆ వాసన వదలదు, ఫలితంగా ఆ దుస్తులు ధరించడం కష్టంగా మారుతుంది.

### 1. నిమ్మరసంతో దుర్వాసనకు చెక్:

మీరు దుస్తులు ఉతికేటప్పుడు వాడే సర్ఫ్‌లో (డిటర్జెంట్‌లో) కొద్దిగా నిమ్మరసం కలపడం వల్ల దుర్వాసన రాకుండా ఉంటుంది. నిమ్మ రసంలో ఉండే విటమిన్ సి వాసనను తొలగించడమే కాకుండా, దుర్వాసనకు కారణమయ్యే బ్యాక్టీరియాను కూడా చంపుతుంది. ఇది దుస్తులకు సహజమైన సువాసనను అందిస్తుంది.

### 2. బేకింగ్ సోడా:


దుస్తులు ఉతికే డిటర్జెంట్‌లో బేకింగ్ సోడా కలపడం వల్ల కూడా మంచి ప్రయోజనాలు కలుగుతాయి. బేకింగ్ సోడా ఒక అద్భుత మైన వాసన నివారిణి. ఇది దుస్తులలోని చెడు వాసనలను గ్రహించి తొలగిస్తుంది. అలాగే, ఉతికిన తర్వాత దుస్తులకు మంచి సువాసన కోసం కంఫర్ట్ వంటి ఫ్యాబ్రిక్ సాఫ్టెనర్‌లను ఉపయోగించడం వల్ల కూడా మంచి ఫలితాలు ఉంటాయి.

### 3. కర్పూరం బిళ్ళతో సువాసన:

వర్షాకాలంలో దుస్తుల నుంచి దుర్వాసనను పోగొట్టడానికి కర్పూరం బిళ్ళలు కూడా చాలా ఉపయోగపడతాయి. దుస్తులు ఆరిన తర్వాత లేదా వాటిని అలమరాలో భద్రపరిచేటప్పుడు, కొన్ని కర్పూరం బిళ్ళలను దుస్తుల మధ్య ఉంచండి. కర్పూరం సహజంగా సువాసనను వెదజల్లి, దుస్తులకు తాజాగా ఉండేలా చేస్తుంది. ఇది తేమను కూడా కొంతవరకు గ్రహిస్తుంది.

### 4. వాషింగ్ మెషిన్, డ్రైయర్ వాడకం:

ఈ రోజుల్లో చాలామంది వాషింగ్ మెషిన్, డ్రైయర్లను ఉపయోగిస్తు న్నారు. ఇవి దుస్తులను త్వరగా ఆరబెట్టడంలో సహాయపడతాయి. అయితే, కొన్నిసార్లు డ్రైయర్ వాడినా కూడా తేమ వల్ల దుర్వాసన రావొచ్చు. పైన చెప్పిన చిట్కాలు వాషింగ్ మెషిన్‌లో ఉతికిన దు స్తులకు కూడా వర్తిస్తాయి. డ్రైయర్‌లో ఆరబెట్టిన తర్వాత కూడా తేలికపాటి దుర్వాసన అనిపిస్తే, ఈ నిమ్మరసం, బేకింగ్ సోడా లేదా కర్పూరం చిట్కాలను పాటించవచ్చు. ఈ చిన్న చిన్న చిట్కాలను పాటించడం ద్వారా వర్షాకాలంలో మీ దుస్తులు తాజాగా, సువాస నభరితంగా ఉండేలా చూసుకోవచ్చు.



# మహిళలు.. ఈ వ్యాయామాలతో పీరియడ్స్ నొప్పి దూరం..

**ఋతుక్రమ నొప్పి నుండి ఉపశమనం పొందడానికి సున్నితమైన వ్యాయామం గొప్ప మార్గం. కొన్ని ప్రభావవంతమైన వ్యాయామాలలో పెల్విక్ టిల్ట్‌లు, నడుము, గ్లూట్ స్ట్రెచింగ్‌లు, పిల్లల భంగిమ వంటి యోగా భంగిమలు ఉన్నాయి. నడక, ఈత, తేలికపాటి కార్డియో కూడా రక్త ప్రసరణను మెరుగుపరచడం, సహజ నొప్పి నివారణ మందులుగా పనిచేసే ఎండార్ఫిన్‌లను విడుదల చేయడం ద్వారా సహాయపడతాయి.**

### పెల్విక్ టిల్ట్స్ :

మీ మోకాళ్లను వంచి, పాదాలను నేలపై ఉంచి మీ వీపు మీద పడుకోండి. మీ పొత్తికడుపు కండరాలను నిమగ్నం చేస్తూ, మీ పెల్విస్‌ను మెల్లగా పైకి వంచండి. కొన్ని సెకన్ల పాటు అలాగే ఉండి, ఆపై విశ్రాంతి తీసుకోండి. దీన్ని 1015 సార్లు పునరావృతం చేయండి. ఇలా చేస్తే ఋతుక్రమ నొప్పి నుంచి బయటపవచ్చు.

### నడుము కింది భాగం, గ్లూట్ స్ట్రెచ్:

మీ కుడి పాదాన్ని ముందుకు, ఎడమ పాదాన్ని వెనుకకు ఉంచి, మడమను పైకి లేపి ప్రారంభించండి. మీ ముందు మోకాలిని వంచి, మీ చేతులను తలపైకి చాచండి. సాగదీసేటప్పుడు మీ తుంటిని కుడి వైపుకు బయటికి కదిలించండి. దీనివల్ల పీరియడ్ పెయిన్ దూరం అవుతుంది.

### పిల్లల భంగిమ:

నేలపై మోకరిల్లి మీ మడమల మీద తిరిగి కూర్చోండి. ముందుకు వంగి, మీ మొండెంను మీ తొడల మధ్య ఉంచండి. మీ చేతులను ముందుకు చాచండి లేదా వాటిని మీ వైపులా విశ్రాంతి తీసుకోండి. ఈ భంగిమను కొన్ని నిమిషాలు పట్టుకోండి. ఈ భంగిమ ద్వారా ఋతుక్రమ నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది.

### ఇతర ఉపయోగకరమైన వ్యాయామాలు:

సున్నితమైన యోగా భంగిమలు కండరాలను సడలించడానికి మరియు ఉద్రిక్తతను తగ్గించడానికి సహాయపడతాయి. చురుకైన నడక రక్త ప్రస రణను మెరుగుపరుస్తుంది మరియు నొప్పిని తగ్గిస్తుంది. నీటిలో ఈత సామర్థ్యం మద్దతు, సున్నితమైన వ్యాయామాన్ని అందిస్తుంది. కొన్ని పైలేట్స్ వ్యాయామాలు కోర్ కండరాలను బలోపేతం చేస్తాయి మరియు భంగిమను మెరుగుపరుస్తాయి.

### ముఖ్యమైన విషయాలు:

ఏదైనా వ్యాయామం నొప్పిని కలిగిస్తే, ఆగి విశ్రాంతి తీసుకోండి. భారీ వ్యాయామాలు కొన్నిసార్లు తిమ్మిరిని మరింత తీవ్రతరం చేస్తాయి. పుష్క లంగా నీరు త్రాగడం వల్ల కండరాల తిమ్మిరిని నివారించవచ్చు. హీటింగ్ ప్యాడ్ వేయడం లేదా వెచ్చని స్నానం చేయడం కూడా ఉపశమనం కలి గిస్తుంది.





# పండ్లను కోసిన తర్వాత ఎంతసేపట్లో తినాలి..?

**పండ్లు మన ఆరోగ్యానికి ఎంత మంచివో మనందరికీ తెలుసు. డాక్టర్లు సైతం ఆహారంలో పండ్లను చేర్చుకోవాలని చెబుతారు. కానీ చాలా మంది పండ్లను కోసి కొన్ని గంటల తర్వాత తింటారు. అయితే కోసిన తర్వాత ఎంతసేపట్లో తినాలో తెలుసుకోవడం చాలా ముఖ్యం. లేకపోతే అది మన శరీరం పై చెడు ప్రభావాన్ని చూపుతుంది.**

పండ్లు మన శరీరానికి మంచివని అందరికీ తెలుసు. ప్రతిరోజ పండ్లను తినడం ఆరోగ్యానికి మంచిది. విటమిన్లు, మినరల్స్, యాంటీఆక్సిడెం ట్లు, ఫైబర్ వంటివి పండ్లలో సమృద్ధిగా ఉంటాయి. పండ్లు తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. ప్రతి ఒక్కరూ తమ ఆహారంలో పండ్లను చేర్చుకోవాలని వైద్యులు సూచిస్తారు. కొన్నిసార్లు మనం పండ్లను కోసి అలాగే ఉంచుతాం. ఆఫీసులు, ఏదైన ప్రయాణ సమయా ల్లో కోసి తీసుకెళ్తుంటారు. కొంతమంది కోసి ఫ్రిజ్‌లో పెడతారు. కొన్ని గంటల తర్వాత వాటిని తింటారు. కానీ కోసిన పండ్లను ఎంతసేపట్లో తినాలి..? అవి ఎంతకాలం మంచిగా ఉంటాయి అనేది చాలా మందికి తెలియదు. ఇవి తెలుసుకోవడం చాలా ముఖ్యం.

### పండ్లు తినడానికి సరైన సమయం ఏమిటి?

పండ్లను ఏ సమయంలో తిన్న మంచిదేనని నిపుణులు అంటున్నా రు. అయితే కొన్నింటిని ఉదయం ఖాళీ కడుపుతో, మరికొన్నింటి ని రాత్రి వేళలో తినకూడదని చెబుతారు. ఏదైనా సరే మితంగా తీసుకుంటే ఆరోగ్యానికి మంచిదని అంటున్నారు.

### కోసిన తర్వాత ఎంతసేపట్లో తినాలి..?

కోసిన వెంటనే పండ్లు చెడిపోవు. కానీ వాటిని ఎంత త్వరగా తింటే అంత మంచిది. నిజానికి కోసిన పండ్లలో ఇన్ఫెక్షన్ ప్రమాదం పెరు గుతుంది. వేసవి, వర్షాకాలం సూక్ష్మజీవుల పెరుగుదలకు ఉత్తమ సమయాలు. ఈ సీజన్లలో కోసిన పండ్ల వల్ల ఇన్ఫెక్షన్ ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి ఎక్కువసేపు నిల్వ చేయకుండా వీలైనంత త్వరగా వాటిని తినాలి. పండ్ల నుండి అన్ని పోషకాలను పొందడానికి వాటిని కోసిన అరగంటలోపు తినడం ఎల్లప్పుడూ మంచిదని ఆరోగ్య నిపుణులు అంటున్నారు.



## ఓ న్యూస్ యాంకర్:


ఇప్పుడు సొంతంగా ఐల్యాండ్, కోట్ల ఆస్తి ఉన్న హీరోయిన్ ఆమె. ఆ హీరోయిన్ మరెవరో కాదండి. జాక్వెలిన్ ఫెర్నాండెజ్. జాక్వెలిన్ తండ్రి శ్రీలంకకు చెందినవారు. తల్లి మలేషియా. ఆమె బహ్రెయిన్‌లోని మనామాలో జన్మించారు. చిన్నప్పటి నుంచే విభిన్న సంస్కృతి, సంప్రదాయల మధ్య పెరిగింది. అక్కడ ఆమె టెలివిజన్ రిపోర్టర్‌గా, లంక బిజినెస్ రిపోర్ట్ షోకు యాంకర్‌గా పనిచేసింది. 2006లో లాస్ ఏంజిల్స్‌లో జరిగిన మిస్ యూనివర్స్ పోటీలో తన దేశానికి ప్రాతినిధ్యం వహిస్తూ మిస్ యూనివర్స్ శ్రీలంక కిరీటాన్ని గెలుచుకుంది. ఆ తర్వాత 2009లో సుజోయ్ ఘోష్ దర్శకత్వంలో వచ్చిన అలాడిన్ అనే ఫాంటసీ డ్రామాతో బాలీవుడ్ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది. ఫస్ట్ మూవీతోనే అందరి దృష్టిని ఆకర్షించింది. దీంతో ఆమె ఐఫా స్టార్ డెబ్యూ ఆఫ్ ది ఇయర్ అవార్డు అందుకుంది. 2011లో వచ్చిన సైకలాజికల్ థ్రిల్లర్ మర్డర్ 2 మూవీతో ఆమె కెరీర్ ఒక్కసారిగా మారిపోయింది. హౌస్‌ఫుల్ 2, రేస్ 2, కిక్ వంటి చిత్రాలతో హిట్లు అందుకుంది. జాక్వెలిన్ ఎక్కువగా స్పెషల్ పాటలతో ఫేమస్ అయ్యింది. అలాగే శ్రీలంకలో సొంతంగా ద్వీపం కొనుగోలు చేసిందట. ప్రస్తుతం బాలీవుడ్ లో వరుసగా సినిమాలు చేస్తూ ఫుల్ బిజీగా ఉంది. ముంబైలో జాక్వెలిన్‌కు 5 బిహెచ్‌కె అపార్ట్‌మెంట్ కూడా ఉందని టాక్. జాక్వెలిన్ ఫెర్నాండెజ్ 2009లో అల్లాదీన్ చిత్రంతో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టింది. కెరీర్ బిగినింగ్ లో ఓ టీవీ ఛానెల్‌లో యాంకర్‌గా చేసింది. హౌస్‌ఫుల్, మర్డర్ 2, కిక్, రేస్ 2తో సహా 35కి పైగా చిత్రాలలో నటించింది. ఇక సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే ఈ ముద్దుగుమ్మ తన గ్లామరస్ ఫోటోలతో ప్రేక్షకులను కవ్విస్తుంది. రకరకాల ఫోటోలు వీడియోలు షేర్ చేస్తూ ఆకట్టుకుంటుంది.



## పదేళ్ల సినీ ప్రయాణం

సోలో హీరోగా పదేళ్ల విజయవంతమైన సినీ ప్రయాణాన్ని పూర్తి చేసుకున్నారు విజయ్ దేవరకొండ. సోలో హీరోగా ఆయన నటించిన తొలి చిత్రం 'పెళ్లిచూపులు' విడుదలై పదేళ్లవుతున్నది. 2016 ఆగస్ట్ 29న విడుదలైన ఈ సినిమా ఫీల్‌గుడ్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకుల్ని మెప్పించింది. ఈ దశాబ్ద కాలంలో టాలీవుడ్ అగ్ర కథానాయకుల్లో ఒకరిగా ఎదిగారు విజయ్ దేవరకొండ. తనదైన స్టైల్, ఛరిష్మాతో యువతలో తిరుగులేని ఫాలోయింగ్‌ను సంపాదించుకున్నారు. టాక్సీవాలా, అర్జున్‌రెడ్డి, గీత గోవిందం, డియర్ కామ్రేడ్, ఖుషి, కింగ్డమ్ వంటి చిత్రాలతో పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగారు. హీరోగా రాణిస్తూనే 'ది దేవరకొండ ఫౌండేషన్'తో సేవా కార్యక్రమాల్ని చేపడుతూ అందరి మన్ననలందుకుంటున్నారు. ఇటీవలే మహబూబ్‌నగర్ జిల్లాలో 180 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ అందించి సేవా భావాన్ని చాటుకున్నారు. ప్రస్తుతం విజయ్ దేవరకొండ 'రణబాలి' 'రౌడీ జనార్ధన' భారీ చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉన్నారు. దర్శకుడు శౌర్యువ్‌తో కూడా ఓ సినిమా ఖరారైన విషయం తెలిసిందే. ఇందులో పలువురు హాలీవుడ్ సాంకేతిక నిపుణులు పనిచేస్తుండటం విశేషం.

## 'రాకా'లో అతిథి పాత్ర?



అల్లు అర్జున్ కథానాయకుడిగా అట్లీ దర్శకత్వంలో రూపొందుతున్న సైన్స్ ఫిక్షన్ 'రాకా' తాలూకు ఆసక్తికరమైన అప్‌డేట్ బయటికొచ్చింది. ఇందులో బాలీవుడ్ బాద్షా షారుఖ్‌ఖాన్ అతిథి పాత్రలో కనిపించబోతున్నారని తెలిసింది. అట్లీ దర్శకత్వంలో షారుఖ్‌ఖాన్ చేసిన 'జవాన్' బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచింది. ఈ నేపథ్యంలో అట్లీ కోరిక మేరకు 'రాకా'లో అతిథి పాత్రలో నటించేందుకు షారుఖ్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని ముంబయి ఫిల్మ్‌సర్కిల్స్‌లో వినిపిస్తున్నది. ఇదేగనుక నిజమైతే ఈ సినిమాకు మరింత హైప్ రావడం ఖాయమని అభిమానులు అనుకుంటున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ జరుపుకుంటున్నది. వెయ్యి కోట్ల బడ్జెట్‌తో రెండు భాగాలుగా తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. తొలిభాగం హిస్టారికల్ బ్యాక్‌గ్రౌండ్‌లో, రెండో భాగం ఫ్యూచరిస్టిక్ వరల్డ్‌లో కొనసాగుతుందని చెబుతున్నారు. ఈ చిత్రంలో దీపికా పడుకోన్ కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. మరో నాయికగా మృణాల్ ఠాకూర్ పేరు కూడా వినిపిస్తున్నది.



## గారాల తనయ సంపూర్ణ

వెంకటేష్ కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న తాజా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఆదర్శకుటుంబం హౌస్ నెం: 47' అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతున్నది. ఈ నేపథ్యంలో ఈ సినిమాలోని పాత్రల్ని పరిచయం చేస్తూ ప్రచార కార్యక్రమాల్ని ముమ్మరం చేశారు. ఇటీవలే చిట్టిబాబు పాత్రలో వెంకటేష్‌ను, స్వర్ణ పాత్రలో కథానాయిక శ్రీనిధిశెట్టిని పరిచయం చేసిన విషయం తెలిసిందే. బుధవారం 'సంపూర్ణ' పాత్రలో యువినా పార్థవిని ఇంట్రడ్యూస్ చేస్తూ కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఇందులో చిట్టిబాబు, స్వర్ణ దంపతుల గారాల కూతురిగా సంపూర్ణ కనిపిస్తుందని.. అల్లరి, అమాయకత్వం, చిలిపితనం కలబోసిన ఆమె పాత్ర నవ్వుల్ని పండిస్తుందని, కుటుంబంలో అనుకోని సంఘటనలకు కూడా కారణమవుతుందని మేకర్స్ తెలిపారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ (చినబాబు) ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

## పూజా కార్యక్రమాలు పూర్తి చేసుకున్న.. త్రీ ఓ క్లాక్...

- ఈషా రామ ప్రియ ఎంటర్టైన్మెంట్... చందు, నిర్మల బ్యానర్ పై వస్తున్న సినిమా...
- సుకుమార్ రెడ్డి పుష్ప జంటగా వస్తున్న తొలి సినిమా...
- నూతన దర్శకుడు మేడిపల్లి అఖిల్... అసిస్టెంట్ డైరెక్టర్ గా ఆఫ్రిన్ నూతన పరిచయం..
- కబీర్ రఫీ సంగీతం, కడారి శ్రీనివాస్ సాహిత్యం ఈ సినిమాకు ఓ మంచి క్రియేషన్ తీసుకురానుంది..
- మీడియా సమావేశంలో డైరెక్టర్ అఖిల్ వెల్లడి...




ఈషా రామ ప్రియ ఎంటర్ టైన్మెంట్ చందు నిర్మల ప్రజెంట్ బ్యానర్ మీద తెరకెక్కుతున్న చిత్రం "త్రీ ఓ క్లాక్..." ఈ సందర్భంగా ఈ చిత్రానికి సంబంధించి పూజా కార్యక్రమాలు ఫిలిం నగర్లో ఘనంగా జరిగాయి. ఈ సినిమాకు డైరెక్టర్గా పరిచయం అవుతున్న మేడిపల్లి అఖిల్ ఒక నూతన కథ అంశంతో దొరక ఎక్కుతున్న చిత్రం ప్రేక్షకులందరికీ మంచి ఫీల్ ని తెస్తుందని ఇది తనకు మొదటి చిత్రమని చాలా కసితో తీస్తున్నానని చెప్పారు. నిర్మాత దరువు మరియు సందీప్ తల్లారి మాట్లాడుతూ నేటి యువత ఆలోచనలు చాలా పవర్ఫుల్ గా ఉన్నాయి అంటూ త్రీ ఓ క్లాక్ అనే సినిమా ఒక మంచి ఫీల్ గుడ్ కద అంశంతో ముందుకు వస్తుందని అందుకని ఈ సినిమాకు ప్రొడ్యూస్ చేయాలని నిర్ణయించుకున్నామని తెలియజేశారు. ఇక ఏ సినిమాకు సంబంధించి డిఓపి సందీప్ తిరుమల ఎడిటర్ మహేష్ మరియు రాజు అసిస్టెంట్ డైరెక్టర్ గా ఆఫ్రిన్... పనిచేస్తుండగా ఏ సినిమాలో హీరో సుకుమార్ రెడ్డి తనకు ఇది మొదటి సినిమా అంటూ తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఇక ఈ సినిమాలో హీరోయిన్ గా పరిచయమవుతున్న పుష్ప.. తనకు ఇది మొదటి చిత్రం అందులో ఈ కథాంశం తనకు బాగా నచ్చింది అంటూ ఎంతో సంతోషంగా ఈ సినిమా చేయడం ఉంది అంటూ సంతోషాన్ని వ్యక్తం చేశారు... ఇక త్రీ ఓ క్లాక్ సినిమాకు సంబంధించి సంగీతం దర్శకత్వం వహిస్తున్న కబీర్ రఫీ మంచి బానిలు అందిస్తున్నానని గతంలో తాను ఎన్నో సినిమాలకు సంగీత దర్శకత్వం అందించానని ఈ సినిమా నూతన కథాంశంతో ఉంది కాబట్టి పాటలు కూడా బాగా వస్తున్నాయి అంటూ తన ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.. ఇక ఈ సినిమాకు సింగిల్ కాంట్ రైటర్ గా కడారి శ్రీనివాస్ (పాటల సిరి) సాహిత్యాన్ని అందిస్తున్న ఏ సినిమా పూజారి కార్యక్రమాలు పూర్తి చేసుకుని త్వరలోషూటింగ్ ప్రారంభించుకుంటుందని తెలియజేశారు.. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ ఆల్ ఇండియా రేడియో జాకీ, సినిమా దర్శకుడు దీన బాంధవ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at **Sri Muktheswara Publications**, Plot No. 31, Mallikarjuna Nagar Colony, Sagar Ring Road, Bairamal Guda, Hyderabad-500079, Dist. Rangareddy, Telangana. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889**. **PRGI No: TGTEL/25/A0314**. email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**